

బీఎస్ఎన్ఎల్ సెల్‌చల్

- పెరుగుతున్న వినియోగదారులు
- గడిచిన ఏడాదిలో సుమారు 90 వేల మంది కొత్త కస్టమర్లు చేరిక
- ప్రైవేటు సంస్థల నుంచి మార్పు

-8లో

ముంచెత్తిన వాన

జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం

- చోడవరం, నర్సీపట్నం, కె.కోటపాడు, సబ్బవరం ప్రాంతాల్లో కుండపోత
- పొంగిపొర్లిన డ్రైనేజీ కాలువలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వివిధ రకాల పంటలకు మేలు చేస్తుందని రైతులు హర్షం
- వాతావరణం చల్లబడడంతో ఉపశమనం

అనకాపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్): ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత అధికంగా వుంది. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తరువాత వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం చెందారు. కాగా ఆదివారం రాత్రి రావికమతం మండలంలో 47.6 మిల్లీ మీటర్లు, కె.కోటపాడులో 43.4, చోడవరంలో 33, చీడికాడలో 25.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వర్షాలు ఊపందుకోవడంతో పాటు కొద్ది రోజుల్లో రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయనుండడంతో వరినాట్లు వేయడానికి రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

అనకాపల్లి పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎన్టీఆర్ స్టేడియం రోడ్డు, విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జితోపాటు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నర్సీపట్నంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షం నీటితో ఎన్టీఆర్ మినీ స్టేడియం చెరువుని తలపించింది.

చోడవరం మండలంలో సాయంత్రం మూడు గంటల నుంచి నాలుగున్నర గంటల వరకు ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. అడ్డూరు వద్ద కొండగెడ్డ పొంగడంతో సబ్బవరం-వెంకన్నపాలెం మధ్య వాహనాల రాకపోకలకు కొంతసేపు ఆటంకం ఏర్పడింది. చెరకు తోటలకు వర్షం ఎంతో ఉపయోగపడుతుందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు.

కశింకోట మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మెట్ట పంటలు, సరుగుడు తోటలకు వర్షం మేలు చేస్తుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊరట చెందారు.

కె.కోటపాడు, దేవరాపల్లి, సబ్బవరం మండలాల్లో మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచింది. రహదారులు జలమయం అయ్యాయి. మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. వరి నారుమళ్లు, కూరగాయల పంటలకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం పడింది. ఏఎల్ పురం మేజర్ పంచాయతీలోని పలు వీధులు నీట మునిగాయి. ఈదురు గాలుల కారణంగా కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



కె.కోటపాడులో కురుస్తున్న వర్షం



అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం రోడ్డులో నిలిచిన వర్షం నీరు



సబ్బవరంలో కురుస్తున్న వాన

చాపకింద నీరులా విస్తరిస్తున్న జ్వరాలు

వణికిస్తున్న మలేరియా

- వర్షాలు కురుస్తుండడంతో పెరుగుతున్న దోమల బెడద
- రికార్డుస్థాయిలో పాజిటివ్ కేసులు నమోదు

సంవత్సరం	మలేరియా రక్త పరీక్షలు	నమోదైన పాజిటివ్ కేసులు
2022	2,94,989	67
2023	3,75,782	175
2024	3,96,860	259
2025	1,86,644	290

(జూలై 20వ తేదీ వరకు)



నాతవరం మండలం చమ్మచింతలో యాంటీ లార్వా మందును పిచికారీ చేస్తున్న మలేరియా సిబ్బంది

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వర్షాలతోపాటు వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాప్తిచెందే మలేరియా జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. దోమల నిరోధానికి జిల్లా మలేరియా శాఖ అధికారులు, సిబ్బంది తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది మలేరియా పాజిటివ్ కేసులు గణనీయంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. మరోవైపు మాకవరపాలెం, నాతవరం, రోలుగుంట, గొలుగొండ మండలాల్లో చికున్ గున్యా కేసులు పెరుగుతున్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి ఆనుకొని అనకాపల్లి జిల్లాలో వున్న దేవరాపల్లి, చీడికాడ, వి.మాడుగుల, రావికమతం, రోలుగుంట, గొలుగొండ, నాతవరం మండలాల్లోని గిరిజన గ్రామాల్లో మలేరియా జ్వరాలు అధికంగా ప్రబలుతున్నాయి. జిల్లా మలేరియా అధికారులు ఆయా మండలాల్లో 108 గ్రామాలను అత్యంత సమస్యాత్మకంగా గురించి దోమల నియంత్రణకు ఏప్రిల్ నుంచే చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే రెండుసార్లు దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ నెలాఖరులోగా మరోసారి మందును పిచికారీ చేయిస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ప్రస్తుతం మలేరియా జ్వర బాధితులు అధిక సంఖ్యలో ఉన్నారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, చలితో వణుకుతో, చమటలు పట్టడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. మలేరియా సిబ్బంది ఇటువంటి వారికి అత్యాధునిక యంత్రంతో రక్త పరీక్షలు నిర్వహించి మలేరియా నిర్ధారణ అయితే నివారణకు మందులు అందిస్తున్నారు. కాగా ఏటా వర్షాకాలంలో దోమల బెడద కారణంగా ప్రజలు మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా జ్వరాలబారి పడుతుండడం సాధారణం. కానీ ఈ ఏడాది పాజిటివ్ కేసులు గణనీయంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. గత ఏడాది జనవరి నుంచి జూలై 20వ తేదీ వరకు జిల్లాలో 2,03,464 మంది జ్వరబాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయగా.. 131 మందికి పాజిటివ్‌గా రిపోర్టులు వచ్చాయి. ఈ ఏడాది ఇదే కాలంలో 1,86,644 మంది జ్వరబాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయగా.. 290 మందికి పాజిటివ్ వచ్చింది. వీరందరికీ ఉచితంగా మందులు అందించారు.

గిరిజన గ్రామాల్లో పంపిణీకి నోచుకోని దోమ తెరలు

దోమల కారణంగానే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి జ్వరాలు ప్రబలుతుంటాయి. ప్రజలు.. ముఖ్యంగా ఏజెన్సీని ఆనకొని వున్న గ్రామాల్లో గిరిజనులు వీటి బారిన పడకుండా దోమ తెరలు పంపిణీ చేయాలి. కానీ ఇంతవరకు ఒక్క గ్రామంలో కూడా దోమ తెరల పంపణీ జరగలేదు. గత ఏడాది కలెక్టర్ విజయకృష్ణన్ చొరవ తీసుకుని సీఎస్ఆర్ నిధులతో 50 వేల దోమతెరలను కొన్ని గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ ఏడాది కూడా త్వరగా పంపిణీ చేస్తే మలేరియా

... మిగతా 8వ పేజీలో

దైన్య స్థితిలో చిప్పాడ

రెండు దశాబ్దాల క్రితం సెజ్‌కు భూములు ఇచ్చి.. నిర్వాసితులైన రైతులు

- పునరావాసానికి ఊబి నేలలో స్థలాలు కేటాయించిన నాటి ప్రభుత్వం
- వెదురువాడ వద్ద స్థలాలు ఇవ్వాలని వినతి
- వీలుకాదంటూ తిరస్కరించిన అప్పటి ఎమ్మెల్యే
- గత టీడీపీ హయాంలో వెదురువాడ వద్ద భూమి కేటాయింపు
- స్థలాలు ఇచ్చే సమయంలో మారిన ప్రభుత్వం
- జగనన్న కాలనీకి కేటాయించిన వైసీపీ పాలకులు
- శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో కాలం వెళ్లదీత
- కూటమి ప్రభుత్వం దృష్టికి నిర్వాసితుల సమస్యలు
- పునరావాసం కల్పించడానికి ఎమ్మెల్యే చర్యలు



వర్షం కురిస్తే కారిపోతున్న పూరింటిలో కాలం వెళ్లదీస్తున్న సెజ్ నిర్వాసితులు



బురదమయమైన చిప్పాడ రోడ్డు

అచ్యుతాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పాడు గ్రామస్థులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు వ్యవసాయ భూములతోపాటు నివాస ప్రాంతాన్ని కూడా త్యాగం చేశారు. ఇది జరిగి సుమారు రెండు దశాబ్దాలు అయినప్పటికీ ఇంతవరకు సొంత గూడుకు నోచుకోలేదు. పునరావాస కాలనీ ఏర్పాటుకు గత టీడీపీ హయాంలో భూమిని కేటాయించగా, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ఈ భూమిని వేరే గ్రామాలకు చెందిన పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించింది. దీంతో శిథిలావస్థకు చేరిన పురాతన ఇళ్లల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుతో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో 24 గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారు. వీరికి దిబ్బపాలెం వద్ద 500 ఎకరాల్లో పునరావాసం కల్పించడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందరితోపాటు చిప్పాడ పంచాయతీ పరిధిలోని చిప్పాడ, ఉద్దపాలెం నిర్వాసితులకు కూడా దిబ్బపాలెంలో స్థలాలు కేటాయించారు. అయితే వీరికి

... మిగతా 8వ పేజీలో

కారిపోతున్న పాకలో ఉంటున్నాం

- రాజాన జగ్గారావు, సెజ్ నిర్వాసితుడు, చిప్పాడ



ప్రత్యేక ఆర్థిక మండలి కోసం రెండు దశాబ్దాల క్రితం వ్యవసాయ భూములు తీసుకున్నారు. అప్పట్లో ఎకరాకు రూ. 1.75 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. దిబ్బపాలెంలో ఊబిగా ఉన్న చోట ఇళ్ల స్థలాలకు కేటాయించారు. దీంతో అక్కడ స్థలాలు వద్దని చెప్పాం. టీడీపీ హయాంలో వెదురువాడ వద్ద భూమి కేటాయించగా, వైసీపీ ప్రభుత్వం స్థలాలు ఇవ్వలేదు. ఇంటిని బాగు చేసుకున్నా వృథానే. వర్షం కురిస్తే కారిపోతున్న పాకలో ఉంటున్నాం

చిప్పాడ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- ఎమ్మెల్యే విజయకుమార్



చిప్పాడ నిర్వాసితుల చాలా దైన్య స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం వీరికి తప్పకుండా న్యాయం చేస్తుంది. నిర్వాసితలు, ఏపీఐఐసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాను. ఇంటి యజమానులతోపాటు మేజర్లయిన యువతీయువకుల పేర్లతో జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించాను. త్వరలో ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం జరిగేలా చూస్తాను.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి

- వరుసగా రెండోసారి ఎంపిక
- పార్టీ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

కొత్తూరు, జూలై 21 (ఆంధ్రజోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శులుగా బొడ్డేడ నాగేశ్వరరావు, బొల్లవరపు రత్నభరత్, గొర్లి రామునాయుడు, ఉపాధ్యక్షులుగా పట్టాభి ప్రసాద్, ఆరుగుళ్ల అప్పారావు (కొండబాబు), కె.రమణమూర్తి, రాజాన దేవి, డి.ఈశ్వరప్రసాద్, రాజాన సన్యాసినాయుడు, బొగ్గారపు సౌందర్య నియమితులయ్యారు. కార్యదర్శులుగా గొల్లవిల్లి రాజేశ్, కొరుపోలు చిన్నారావు, చిరువూరి ఉమ, జి.ధనలక్ష్మి, దాడిశెట్టి ఈశ్వరరావు, టి.దుర్గ, జి.భానుమతి, కోశాధికారిగా ఎం.ఎం.నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్‌గా బొడ్డేడ భాస్కరరావు, ఐటీ సెల్ కన్వీనర్‌గా కొణతాల సాయి రామప్రసాద్‌లను నియమించారు.

తాండవ ఆయకట్టుకు రెండో వారంలో నీరు విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ

- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ
- నీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో సమావేశం
- త్వరలో తేదీ ఖరారు

నాతవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు వచ్చే నెల రెండో వారంలో నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. ఆయకట్టుకు నీటి విడుదలపై సోమవారం ప్రాజెక్టు అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో ఇక్కడ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఆగస్టు ఏడు తరువాత 15వ తేదీలోపు నీటి విడుదలను ప్రారంభించాలని కోరారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, ప్రస్తుతం తాండవ రిజర్వాయర్‌లో 370 అడుగుల మేర నీటినిల్వలు ఉన్నాయని తెలిపారు. ఏ తేదీన నీటిని విడుదల చేసేది త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. పండుగ వాతావరణంలో జలహారతి ఇచ్చి కాలువలకు నీటిని విడుదల చేస్తామన్నారు. పంట కాలువల్లో ఈ ఏడాది సుమారు రూ.6 కోట్లతో పలురకాల పనులు చేయించామని ఆయన చెప్పారు. వచ్చే ఏడాది మరిన్ని నిధులు మంజూరు చేస్తానని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అంతకుముందు మన్యపురట్ల నీటి సంఘం అధ్యక్షుడు అప్పన్న దివాణం మాట్లాడుతూ, నిమ్మకట్టు ఛానెల్‌కు తలుపుల ఏర్పాటుకు నిధులు మంజూరు అయినప్పటికీ ఇంకా పనులు మొదలు పెట్టలేదన్నారు. ఇండిపల్లి మేజర్ కాలువ గట్టును కొంతమంది ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారని, అలాగే

... మిగతా 8వ పేజీలో

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సు

- ఈఏపీ సెట్ ద్వారా ప్రవేశాలు
- ఈ ఏడాది నుంచే ప్రారంభం
- మొదటి సంవత్సరం 30 మందికి అవకాశం
- ఆమోదం తెలిపిన అకడమిక్ సెనేట్
- ఎంటెక్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఎంటెక్ ఓషియానిక్ సైన్స్ కోర్సులు పునఃప్రారంభం
- దూరవిద్య పీజీ కోర్సులకు సెమిస్టర్ విధానంలో పరీక్షలు



సెనేట్ సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్ క్వాంటం కంప్యూటింగ్ కోర్సు నిర్వహణకు సెనేట్ ఆమోదం తెలిపింది. సోమవారం ఉదయం జరిగిన సెనేట్ సమావేశంలో నూతన కోర్సు ప్రారంభానికి సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశాలను ఈఏపీసెట్ ద్వారా కల్పించనున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో ఈ కోర్సు నిర్వహించనున్నారు. తొలి బ్యాచ్‌లో 30 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ కోర్సుకు సంబంధించిన సబ్జెక్టులను కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, ఇనుస్ట్రుమెంటేషన్, ఈసీఈ తదితర విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు బోధించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని భావిస్తున్న తరుణంలో దేశవ్యాప్తంగా అతికొద్ది విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న ఈ కోర్సును ఏయూలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే, మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగం నుంచి గతంలో నిర్వహించి నిలిపివేసిన ఎంటెక్ అట్మాస్పియరిక్ సైన్స్

... మిగతా 8వ పేజీలో

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



చిరంజీవి (ఫైల్ ఫొటో)

గొలుగొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ హాస్టల్ వీధిలో విద్యుదాఘాతంతో ఒక వ్యక్తి మృతిచెందాడని ఎస్ఐ పి.రామారావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలు ఇలా వున్నాయి. గొలుగొండ గ్రామంలోని బీసీ హాస్టల్ వీధిలో నివాసముంటున్న పాసిపల్లి చిరంజీవి(34) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. సోమవారం ఉదయం తన ఇంటి పైఅంతస్థు పిట్టగోడను నీటితో తడుపుతుండగా సమీపంలో ఉన్న కరెంటు వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిరంజీవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నివాస ప్రాంతాల పైనుంచి ఫ్లైఓవర్ వద్దు

- రైల్వే అధికారులకు నాగరాజుపేట ప్రజల వేడుకోలు
- సర్వేను అడ్డుకున్న ఆ ప్రాంతవాసులు
- వినతిపత్రం ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతా : తహసీల్దార్
- శాంతించిన బాధితులు

పాయకరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాగరాజుపేటలోని నివాసప్రాంతాల మీదుగా రైల్వే ఫ్లైఓవర్ వంతెన వద్దని, సమీపంలో ఉన్న ఖాళీ స్థలం మీదుగా ఏర్పాటు చేయాలని నాగరాజుపేటకు చెందిన నివాసితులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పాయకరావుపేటలో తాండవ వంతెనను ఆనుకుని నాగరాజుపేట రైల్వే గేటు మీదుగా రైల్వే ఫ్లైఓవర్ ఏర్పాటు కోసం సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసేందుకు రైల్వే చీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు వచ్చారు. విషయం తెలుసుకున్న నాగరాజుపేటకు చెందిన ప్రజలు వచ్చి కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా సర్వే చేసేందుకు రావడం సరికాదని, తమ ఇళ్లను తొలగించి ఫ్లైఓవర్ ఏర్పాటు చేయవద్దని రైల్వే అధికారులకు వేడుకున్నారు. తాండవ నదిని ఆనుకుని నాగరాజుపేటలో 500 పేద కుటుంబాలు ఐదు దశాబ్దాలుగా నివాసముంటున్నారని, ఇపుడు వాటిని తొలగించి ఫ్లైఓవర్ ఏర్పాటు చేస్తామంటే తామంతా రోడ్డున పడతామన్నారు.

తమకు ఆత్మహత్యలే శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యారు. నాగరాజుపేట మీదుగా కాకుండా సమీపంలో ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న ఖాళీ స్థలం మీదుగా ఫ్లై ఓవర్ వేసేలా చర్య లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రైల్వే అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల


రైల్వే అధికారులను వేడుకుంటున్న నాగరాజుపేట నివాసితులు


వారం రోజులు గడువు ఇస్తున్నట్టు ప్రకటిస్తున్న తహశీల్దారు మహేశ్వరరావు

మేరకు సర్వే చేసేందుకు వచ్చామని, సమస్య ఉంటే మంత్రి, ఎంపీ, జిల్లా కలెక్టర్‌కి తెలియజేయాలి తప్ప సర్వే పనులను అడ్డుకోవద్దన్నారు. అయినా బాధితులు వినకుండా అధికారుల కాళ్లావేళ్లా పడుతూ సర్వే పనులు చేపట్టకుండా అడ్డుకున్నారు. దీంతో తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు, పాయకరావుపేట సీఐ జి.అప్పన్న సిబ్బందితో వచ్చి నాగ రాజుపేట ప్రజలకు ఎంత నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు తహసీల్దారు మహేశ్వరరావు వచ్చి చెప్పినా బాధితుల్లో మార్పు రాలేదు. దీంతో బాధితుల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే పనులను వారం రోజులు నిలుపుదల చేస్తామని, ఈలోగా సమస్య తెలియజేస్తూ వినతిపత్రం అందజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. దీంతో బాధితులు శాంతించడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

రాజీనామాపై మాట మార్చిన బొలిశెట్టి

వైసీపీ కేడర్, పార్టీ పెద్దల ఒత్తిడితో నిర్ణయం వెనక్కి


విలేకర్లతో మాట్లాడుతున్న బొలిశెట్టి గోవిందరావు


ఎస్.రాయవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనా మా చేస్తున్నట్టు ప్రకటిం చిన వైసీపీ ముఖ్య నాయకుడు, తాత్కాలిక ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు తన ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. సోమవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం వద్ద గోవిందరావు విలేకర్లతో మాట్లాడుతూ తాను చేసిన రాజీనామా ప్రకటనకు కట్టుబడి ఉన్నానని, అయితే వైసీపీ రాజీనామా చేస్తున్నాననే విషయం తెలిసిన మండలంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఒత్తిడి చేశారన్నారు. అంతేకాకుండా పార్టీ పెద్దలు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు ఫోన్ చేసి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని సూచించారన్నారు. మూడు, నాలుగు రోజుల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ వద్దకు తీసుకు వెళతామని, అప్పటి వరకు ఓపిక పట్టాలని సూచించారన్నారు. అలాగే వీసం రామకృష్ణ వచ్చి తనతో మాట్లాడారని, సమస్య పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లిందని, రాజీనామా ఆలోచనను విరమించుకోవాలని సూచించారని బొలిశెట్టి గోవిందరావు చెప్పారు. వైసీపీ కేడర్ అభ్యర్థన మేరకు నాలుగు రోజుల పాటు తన రాజీనామా నిర్ణయాన్ని వాయిదా వేసి, జగన్‌ను కలిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటానని బొలిశెట్టి గోవిందరావు చెప్పారు.

కవలపాడు కాలువలో పూడికతీత పనులు ప్రారంభం


పూడికతీత పనులను పరిశీలిస్తున్న ప్రదీప్, వంకా వెంకరమణ

పాయకరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పది వేల ఆయకట్టుకు సాగునీరందించే ముతా కాలువకు చెందిన కవలపాడు కాలువలో పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. ఈ పనులను పరిశీలించిన టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్ మాట్లాడుతూ తుప్పలతో పూడుకుపోయిన పంట కాలువను ఆపరేషన్స్ అండ్ మెయింటినెన్స్ గ్రాంట్ రూ.1.6లతో అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. దీనివలన కాకినాడ జిల్లా తుని మండలంతోపాటు ముతా కాలువ శివారు ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో సాగు నీరందుతుందని తెలిపారు. ఆయన వెంట వెంకటనగరం సర్పంచ్, వంకా వెంకటరమణ ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలి : ఎంపీడీఓ


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు

పాయకరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడుతున్న ప్రస్తుత సమయంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ఆదేశించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుతోపాటు తాగునీటి వనరుల క్లోరినేషన్ చేపట్టి రక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, సచివాలయాల సేవలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ కె.డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవతో రైతులకు మేలు'


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ నరసింహమూర్తి

నక్కపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తహశీల్దార్ నరసింహమూర్తి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏవో ఉమాప్రసాద్‌తో కలిసి నిర్వహించిన వ్యవసాయ శాఖ సమీక్షా సమావేశంలో తహశీల్దార్ మాట్లాడారు. మండలంలో 12,421 మంది లబ్ధిదారులుండగా వీరిలో 1,335 మందికి ఆధార్ సీడింగ్ తప్పుగా ఉందన్నారు. ఆధార్ సీడింగ్ తప్పు ఉన్నవారంతా సరిచేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, ఏఈవోలు సాయి, కుమారి, శ్రీనివాస్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

సెజ్ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు

అచ్యుతాపురం జూలై 21 (ఆంధ్రజ్యోతి): సెజ్ నిర్వాసితులకు సోమవారం లాటరీ పద్ధతిపై ఇళ్ల స్థలాలను కేటాయించారు. రాంబిల్లి మండలం కృష్ణంపాలెం, నారప్ప కొంపల సంతపాలెం, అప్పన్నపాలెంకు చెందిన 252 మంది నిర్వాసితులకు సెజ్ పునరావాస కాలనీలో ఇళ్ల స్థలాలను కేటాయించారు. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)కోసం భూసేకరణలో రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన 24 గ్రామాల రైతులు నిర్వాసితులయ్యారు. వీరికి పరిహారంలో పాటు దిబ్బపాలెం వద్ద 452 ఎకరాల్లో పునరావాసం కల్పించారు. కాని రాంబిల్లి మండలం కృష్ణంపాలెం పంచాయతీకి చెందిన కృష్ణంపాలెం, నారప్పకొంపలు, అప్పన్నపాలెం సంతపాలెం నిర్వాసితులకు ఇంతవరకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. గత వైసీపీ ప్రభుత్వం వీరికి ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. దీంతో వీరు గ్రామాలను ఖాళీ చేయలేదు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెజ్‌లో కర్మాగారాలు ఏర్పాటు చేయడానికి పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారు. దీంతో పారిశ్రామికవేత్తలకు అత్యవసరంగా భూ కేటాయింపులు జరపాల్సి ఉన్నందున సత్వరం నిర్వాసితులు గ్రామాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పలుమార్లు నిర్వాసితులతో వారిని ఒప్పించారు. నిర్వాసితులు అంగీకరించడంతో సెజ్ పునరావాస కాలనీలో ఖాళీ స్థలాలను చదును



ఏపీఐఐసీ కార్యాలయంలో లాటరీ పద్ధతిపై
ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న దృశ్యం

చేశారు. సోమవారం లాటరీ పద్ధతిపై వీరికి స్థలాలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ షేక్ ఆయాషా, ఏపీఐఐసీ అధికారులు రాజశేఖర్, నర్సింగరావు, శ్రీనుబాబు, రాంబిల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లాలం భాస్కరరావు జయంతి

- హాజరైన ఎమ్మెల్యేలు, కూటమి నేతలు

రాంబిల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లాలంకోడూరులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు స్వర్గీయ లాలం భాస్కరరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్‌బాబు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన నేతలు హాజరయ్యారు. తొలుత భాస్కరరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ లాలం భాస్కరరావు ఉమ్మడి విశాఖ జిల్లాలో నాయకుడిగా, సేవాపరుడుగా మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. ఆయనకు పేదలంటే ఇష్టమని, రోగులకు సైతం ఆయన దగ్గ


లాలం భాస్కరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, సుందరపు విజయకుమార్ తదితరులు


కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

రుండి వైద్యసేవలు అందించిన మహానాయకుడు భాస్కరరావు అని కొనియాడారు. ఆయన కుమారుడు భరత్ తండ్రి ఆశయ సాధనకు పాటుపడున్నాడని, టీడీపీ మండల అధ్యక్షుడుగా ఉన్న భరత్‌ను నాయకులు, కార్యకర్తలు ఆశీర్వాదించాలన్నారు. అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ఆసుపత్రులకు చెందిన డాక్టర్‌లను లాలం కుటుంబీకులు ఘనంగా సత్కరించారు. పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ, టీడీపీ రాష్ట్రకార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, టీడీపీ నాయకులు వి.దిన్‌బాబు, లాలం సత్యప్రసాద్, లాలం రమేష్‌నాయుడు, అభిరామ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, లాలం అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా సుపరిపాలనలో తొలి అడుగు

ఎలమంచిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకులు మునిసిపాలిటీ, మండలంలో సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కార్యదర్శి ఆడారి ఆదిమూర్తి, జిల్లా ప్రతినిధి కొఠారు సాంబ, ఆడారి రమణబాబు, మండలంలోని మండల పార్టీ అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయబాబు, జిల్లా అధికారప్రతినిధి కాండ్రకోట చిరంజీవి తదితర నేతలంతా వార్డులతో పాటు సమీప గ్రామాల్లో సైతం ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. పట్టణంలోని 21వ వార్డులో బొద్దపు రమణ, నమ్మి రమణ, 17వ వార్డులో కరణం రవికుమార్, రాజామహేష్‌లు స్థానిక నేతలతో కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేసిన అభివృద్ధిపై కరపత్రాలు ఇంటింటికి అందజేశారు.


ఎలమంచిలిలో ఇంటింటా తిరిగి ఏడాది పాలనపై వివరిస్తున్న టీడీపీ నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు తులసీరామ్

అచ్యుతాపురంలో..

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలో శతశాతం పూర్తిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్ అన్నారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కేవలం 40 శాతమే పూర్తయిందని, వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల అప్పారావు, మామిడి శివ అప్పారావు, పతివాడ చిన్నయ్యనాయుడు, కండ్రేగుల సూర్యనారాయణ, లాలం రమణ, ధర్మిరెడ్డి నాయుడు బాబు, రాజాన రామునాయుడు, రావి శ్రీను పాల్గొన్నారు.

గోకివాడ మాజీ సర్పంచ్ అప్పారావుకు ఘన నివాళి


అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్, నేతలు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు తదితరులు

రాంబిల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకివాడ మాజీ సర్పంచ్ స్వర్గీయ ద్వారపురెడ్డి అప్పారావుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం పెదకర్మను కుటుంబ సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు,మాజీ ఎమ్మెల్యే యూవీ.రమణమూర్తిరాజు,వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ ఎలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, జడ్పీటీసీ సభ్యులు దూళి నాగరాజు, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, వివిధ పార్టీల నేతలు అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ నీరుకొండ శారద, కుమారుడు ద్వారపురెడ్డి నాగేశ్వరరావు, అప్పారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు ఆందోళన



ఐసీడీఎస్ కార్యాలయాధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఎలమంచిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లైనుకొత్తూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ పోషణ ట్రాకర్ యాప్, బాలసంజీవిని యాప్‌లు పెట్టి గంటల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారన్నారు. డిపార్టుమెంట్ ఇచ్చిన సెల్‌లు, సర్వర్‌లు సక్రమంగా పనిచేయని కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అంగన్‌వాడీల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం పాత పద్ధతిలోనే నిర్వహణ ఉండేలా చేయాలని డిమాండ్ చేశారు. ప్రీస్కూలు బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు డిమాండ్లతో ఉన్న వినతిపత్రాన్ని కార్యాలయాధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పీటీడీ డ్రైవర్ల విశ్రాంతి హాలు ప్రారంభం


బస్టాండ్‌లోని మొదటి అంతస్తులో డ్రైవర్ల విశ్రాంతి హాలు

ఎలమంచిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పీటీడీ బస్టాండ్ ఆవరణలో రూ.29 లక్షలతో నిర్మించిన డ్రైవర్ల విశ్రాంతి హాలును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ప్రారంభించనున్నారని పీటీడీ అధికారులు తెలిపారు. బస్టాండ్ ఆవరణలో మొదటి అంతస్తులో విధులు నిర్వర్తించిన డ్రైవర్ల కోసం విశ్రాంతి హాలును నిర్మించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్టు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


మంగవరంలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పాయకరావుపేట రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా మారింది. గ్రామంలో నూకాలమ్మ గుడి వద్ద ఉన్న ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మనిషి చేతికందే ఎత్తులో ఉండడంతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే స్టేజి ఉంది. ఈ స్టేజిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అటువంటి సమయంలో జనం ఎక్కువగా వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎటువంటి రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిబంధనల మేరకే తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కార్యకర్త నియామకం : సీడీపీవో

అచ్యుతాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కార్యకర్త నియామకం నిబంధనల మేరకే జరిగిందని ఐసీడీఎస్ సీడీపీవో కె. ఇందిరా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మరాజుపేటలో అర్హులైన దళిత మహిళకు కాకుండా బీసీ మహిళకు అంగన్‌వాడీ పోస్టుని నిబంధనలకు విరుద్ధంగా నియమించారంటూ తిమ్మరాజుపేటలో ఆందోళన చేస్తున్నారు. దీనికి స్పందించిన ఇందిరాదేవి సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈరిగల భారతి దళిత కుటుంబానికి చెందినది. అయితే బీసీ కులస్థుడిని వివాహం చేసుకుంది. అంతమాత్రాన ఆమె కులం మారదన్నారు. సెలెక్షన్ కమిటీ నియమ నిబంధనల మేరకు భారతిని కార్యకర్తగా నియమించామని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించలేదన్నారు.

భూముల సర్వే ఆపండి

- కలెక్టర్‌కు నారాయుడుపాలెం రైతులు వినతి

మునగపాక, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికీకరణ పేరుతో భూములు తీసుకుంటే జీవనోపాధి కోల్పోతామని నారాయుడుపాలెం గ్రామస్థులు, రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.వెంకటి, పాల సొసైటీ అధ్యక్షుడు సబ్బి శ్రీను తదితరులు మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారని, సర్వే నిలిపివేయాలని కోరారు. భూసేకరణ చేస్తే బతుకు జీవనం ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా మునగపాక తహశీల్దార్ కార్యాలయంలో కూడా సర్వే నిలుపుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.రాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2గా శ్రీరామమూర్తి బాధ్యతల స్వీకరణ


శ్రీరామమూర్తి

ఎస్.రాయవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి-2గా సైతారుపేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కర్రి శ్రీరామమూర్తిను నియమించడంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీరామమూర్తికి ఎంఈవో-1, ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు తదితర ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈవో-2గా నాగన్నదొర..


నాగన్నదొర

నక్కపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి-2గా ఉద్దండపురం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రుత్తల నాగన్నదొర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన నాగన్నదొరకు పలు పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంఈవో స్థానిక హరిజనవాడ పాఠశాలను సందర్శించి సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 కె. నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల ఎంఈవో-2గా లక్ష్మీనారాయణ..


లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

కోటవురట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి-2గా కేవీ లక్ష్మీనాయరాణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాములవాక జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎంఈవో -2గా పనిచేసిన జోషి గత నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. దీంతో జిల్లాఅధికారులు లక్ష్మీనారాయణను ఎంఈవో -2గా నియమించారు. ఎంఈవో-2ను ఎంఈవో రామారావు, సిబ్బంది, కోటవురట్ల సర్పంచ్ అనిల్‌కుమార్. ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యారావు శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నక్కపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలోని ఉపమాక జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉద్దండపురం గ్రామానికి చెందిన బొండాడ అప్పారావు, పెండ్యాల దుర్గాప్రసాద్ బైక్‌పై అడ్డరోడ్డు నుంచి తమ గ్రామానికి వెళుతుండగా ఉపమాక జంక్షన్ వద్దకు వచ్చేసరికి ప్రైవేట్ స్కూల్ బస్సు తగిలింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన ఇద్దరినీ స్థానికులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి

▸▸ అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి



ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి సోమవారం విస్తృతంగా పర్యటించారు. పూడిమడక రోడ్డులోని చెత్తను దగ్గరుండి సిబ్బందితో వాహనాల్లోకి ఎక్కించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిశీలించారు. అక్కడి మైదానం బురదమయంగా ఉండడాన్ని చూశారు. వాకర్లు అక్కడి సమస్యను ఆయనకు వివరించారు. వర్షాలు కురిసే సమయాల్లో మైదానంలో వాకింగ్ చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే పరిస్థితిని మెరుగు పర్చడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన స్టేడియంలో మైదానం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, గుండాల జంక్షన్ వద్ద గల ఎస్ఆర్ శంకరన్ నిలయం పక్కనున్న జిమ్‌ను క్రీడాకారులకు అనుగుణంగా ఎన్టీఆర్ స్టేడియంలోకి మార్పు చేయనున్నామని వివరించారు. జడ్సీ వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ రవి, సిబ్బంది ఉన్నారు. అనంతరం తన కార్యాలయంలో జరిగిన సమావేశానికి జడ్సీ హాజరయ్యారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఇదిలావుంటే, 80వ వార్డు కూటమి నాయకులు వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు ఆధ్వర్యంలో జడ్సీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

పచ్చిరొట్ట ఎరువుతో మహా మేలు

▸▸ నేల సారం పెరగడంతో పాటు సాగు ఖర్చు ఆదా : కలెక్టర్



పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం పచ్చిరొట్ట ఎరువుకు సంబంధించిన పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు పచ్చిరొట్ట పైరును వాడడం ద్వారా 25 శాతం ఎరువు ఆదా అవుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో జీవం ఉంటుందని, పచ్చిరొట్ట ఎరువు వాడడం వలన నేల సారం పెరగడంతో పాటు పోషకాల వృథా తగ్గింపు, సాగు ఖర్చు ఆదా వంటి లాభాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ ఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'మూగ జీవాలపై పశు వైద్యులకు నిర్లక్ష్యం తగదు'



ఊడేరులో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్

తుమ్మపాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్‌లను గ్రామాల్లో ఇంతవరకు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్న పశు వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. మండలంలోని ఊడేరులో సోమవారం పర్యటించి గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశు వైద్యాధికారులు గ్రామాల్లో పశువులకు అందించాల్సిన వైద్య సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దన్నారు. తక్షణమే నట్టల నివారణ మందులను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందార్లు ఈశ్వరరావు, అప్పలనాయుడు, నాగప్పారావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

7న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన



ఆందోళన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వచ్చేనెల ఏడోతేదీన నిర్వహించనున్న 'చలో విజయవాడ విద్యుత్ సౌధ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సూరిబాబు, ముజఫర్ పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ ఇందుకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. వేలాది మంది కార్మికులు మూడు దశాబ్దాలకుపైగా అతి తక్కువ వేతనాలతో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారన్నారు. వీరి సేవలను ఇప్పటికీ ప్రభుత్వాలు గుర్తించకపోవడంతో ఈ ఆందోళన చేపట్టనున్నట్టు చెప్పారు. యూనియన్ నాయకులు వేపాడ సత్యనారాయణ, ప్రేమచంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీఐటీయూ నిరసన

పరవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అదనపు భారంగా మారుతున్న స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పరవాడ మండల పరిషత్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని చెప్పి, నేడు మాట మార్చడం దారుణమన్నారు. ఇప్పటికే ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పైలా అప్పలనాయుడు, అప్పలరాజు, బాబూరావు, రాజాన శ్రీను, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

'వీఓఏల సమస్యలు పరిష్కరించాలి'

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వెలుగులో పనిచేస్తున్న వీఓఏలకు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని వీఓఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం డీఆర్‌డీఏ పీడీ శచీదేవికి వినతి పత్రం అందజేసిన అనంతరం మాట్లాడారు. మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీ అమలు చేయకపోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో భారీ వర్షం

▸▸ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ▸▸ నాలుగు గంటల ప్రాంతంలో కుండపోత

▸▸ లోతట్టు ప్రాంతాలు జలమయం ▸▸ వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం



పరవాడ సంతబయలు వద్ద ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు



కశింకోటలో భారీగా కురుస్తున్న వర్షం

అనకాపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చినుకులతో ఆరంభమై కుండపోతగా పడింది అనకాపల్లి పట్టణంలో 10 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు అంచనాగా తెలిపారు. వర్షం కారణంగా ఇక్కడ పలు రహదారుల్లో నీరు నిలిచిపోయింది. విద్యా సంస్థలు విడిచిపెట్టే సమయంలో వర్షం కురవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం రోడ్డులో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. స్టేడియంలోని మైదానం బురదమయమైంది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో అనకాపల్లి- చోడవరం మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కశింకోట మండలంలో..

కశింకోట : మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు భగభగమన్నాడు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో గాలులతో ఏకధాటిగా వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గ్రామీణ ప్రాంతాల్లో పలు రహదారులు బురదమయంగా మారాయి. దీంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజా వాతావరణంతో మండలవాసులు ఉపశమనం పొందారు. ఈ వర్షం వ్యవసాయ పనులకు ఉపకరిస్తుందని రైతులు చెపుతున్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ : మండల కేంద్రం పరవాడ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. సుమారు అర్ధగంట పాటు పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయింది. ఈ వర్షం వరి ఆకు మడులు, కూరగాయల పంటలకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, వర్షం వల్ల పలు గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ మండిపోయింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సుమారు గంట పాటు ఏకధాటిగా వర్షం పడడంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. వరి నారు పోసుకునేందుకు వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

▸▸ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల శిబిరంలో ఎమ్మెల్యే 'కొణతాల'



స్క్రీనింగ్ టెస్ట్ తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. క్వారీ ప్రభావిత గ్రామాలైన మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, ఊడేరు గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత స్క్రీనింగ్ టెస్ట్‌ల శిబిరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనకాపల్లి మండలంలో మైనింగ్ అధికంగా జరుగుతున్న 11 గ్రామాల్లో ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పలువురు కిడ్నీ వ్యాధులకు గురికావడంతో వారి కుటుంబాలు ఛిన్నాభిన్నం అయినట్టు గుర్తించామన్నారు. భవిష్యత్తులో వ్యాధుల నుంచి ఉపశమనం పొందేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే క్వారీ, క్రషర్లు అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రజలకు స్క్రీనింగ్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కిడ్నీ వ్యాధుల బారిన పడిన వారికి అనకాపల్లిలో నెఫ్రాలజీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వైద్యులు డాక్టర్ నీలిమా రాణి, డాక్టర్ మేఘన, డాక్టర్ వాణి జగదీశ్వరి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ యశోధ, డాక్టర్ తిరుపతిరావు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, అనకాపల్లి మండలంలో రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తుమ్మపాల, గుంకలలోవలో రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థులకు ఉచితంగా సేవలు

కొత్తూరు : సంపతిపురం గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ పరీక్షల కేంద్రాన్ని ఎమ్మెల్యే కొణతాల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల వద్ద గల గ్రామాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారంతా శీరం క్రియేట్నం పరీక్షలకు ముందుకు రావాలన్నారు. ఈ ప్రత్యేక శిబిరంలో కిడ్నీ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా వైద్యం చేయిస్తామని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఎంపీపీ స్కూల్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నది ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ నంబారు నాగమణి, కూటమి నాయకులు నంబారు శ్రీనివాసరావు, గణేష్, లోవరాజు, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయి

▸▸ 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మాజీ ఎమ్మెల్యే పీలా



మూలపేటలో సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న పీలా గోవింద



గౌరీ సంఘం రోడ్డులో మహిళలకు కరపత్రం అందిస్తున్న సురేంద్ర

కొత్తూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కూటమి పాలనలో సాధించిన విజయాలను వివరించి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు సమస్యను గ్రామస్థులు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఎమ్మెల్యే కొణతాల, ఎంపీ సీఎం రమేష్‌లతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే, పంచాయతీలో దీర్ఘకాల సమస్య అయిన రైల్వే అండర్ పాస్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీ సంఘం రోడ్డులో...

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని 81వ వార్డు పరిధి పార్కు సెంటర్, గౌరీ సంఘం రోడ్డులో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందాలన్న సంకల్పంతో ఉన్నట్టు చెప్పారు. అనుభవజ్ఞులైన చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, శరగడం శాంతారాం, ఎండకుర్తి అప్పలరాజు, తణుకు రవి, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారయ్యపేట ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై వినతి

కశింకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేట ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు మహిళలు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలి

▸▸ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీల ఆందోళన



కొత్తూరు ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



సబ్బవరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట...

కొత్తూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం అనకాపల్లి మండలం కొత్తూరులో గల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని, పని ఒత్తిడి తగ్గించి, 5జీ మొబైల్ ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ రెండు రకాల యాప్‌లు తీసుకు రావడంతో అంగన్‌వాడీ సిబ్బందిపై పనిభారం పెరిగిందన్నారు. సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో బాలింతలకు అసౌకర్యంగా ఉందన్నారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, కార్యదర్శి పరమేశ్వరరావు, ప్రాజెక్టు ప్రతినిధులు ఎన్.వరలక్ష్మి, వి.కృష్ణవేణి, సిహెచ్.లక్ష్మి, తులసి, ఎస్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట..

సబ్బవరం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేసి సెంటర్ నిర్వహణకు ఒకే యాప్ నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య తలెత్తడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గతంలో ప్రభుత్వం వీరికి ఇచ్చిన ఫోన్లు ప్రస్తుతం సరిగా పనిచేయడం లేదన్నారు. నాణ్యమైన ఫోన్లు సరఫరా చేయాలని కోరారు. అనంతరం సీడీపీవో లలితకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల ప్రాజెక్టు అధ్యక్షురాలు వీవీ రమణమ్మ, కోశాధికారి పి.రమణమ్మ, కార్యదర్శి రమణమ్మలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అశోక్‌గజపతిరాజును కలిసిన ఎమ్మెల్సీ చిరంజీవిరావు



అశోక్ గజపతిరాజుకు జ్ఞాపిక అందిస్తున్న చిరంజీవిరావు

అనకాపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియామకమైన పూసపాటి అశోక్ గజపతిరాజును సోమవారం విజయనగరంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బంది సత్కారంలో సర్పంచ్ తదితరులు

సబ్బవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బంగారమ్మపాలెం సచివాలయంలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన సిబ్బందికి సోమవారం గ్రామంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ సభ్యురాలు రాపేటి అరుణ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలకు తావులేకుండా సచివాలయ సిబ్బంది చక్కని సేవలందించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు రాపేట రాము, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

29న సబ్బవరం మండల సమావేశం

పరవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీ ఉదయం ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీవో బి.రమేశ్ నాయుడు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు విధిగా పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

వంగలి వీఆర్ఏకు ఆర్థిక సాయం

సబ్బవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వంగలి గ్రామ రెవెన్యూ సహాయకుడు ఎస్.కనకారావు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు పలువురు సిబ్బంది బాసటగా నిలిచారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు ఎన్.గంగాధర్ చొరవతో తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్.అప్పారావు ఇతర సిబ్బంది సహకారంతో రూ.35 వేలను పోగు చేసి సోమవారం కనకారావు భార్యకు అందజేశారు.

వేతన బకాయిలు చెల్లించాలని క్లాప్ లోడర్లు ధర్నా



వాహనాల పార్కింగ్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలంటూ క్లాప్ లోడర్లు ఇక్కడి జీవీఎంసీ వాహనాల పార్కింగ్ స్థలంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వై.భారతి, ప్రసాద్, భాస్కరరావు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట బీసీ హాస్టల్‌లో నాణ్యతలేని ఆహారం

▸▸ పలువురు విద్యార్థులు ఆవేదన



ముద్దయిన పులిహోరను చూపుతున్న విద్యార్థులు

కశింకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట వెనుకబడిన బాలుర వసతి గృహంలో సోమవారం వంటకాలు బాగోలేవంటూ పలువురు విద్యార్థులు వాపోయారు. మెనూ ప్రకారం ఉదయం చింతపండుతో తయారు చేసిన పులిహోర వండి వడ్డించారని, అయితే అది రుచిగా లేదుసరికదా, సరిగా ఉడకలేదని విద్యార్థులు 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేశారు. దీంతో ఆకలితోనే పాఠశాలకు వెళ్లామన్నారు. తిరిగి సాయంత్రం వసతి గృహానికి చేరుకోగా రాత్రి 7.30 గంటలకు అన్నం వండినప్పటికీ అదే తరహాలో ఉందని విద్యార్థులు వెల్లడించారు. ఇలా అయితే తాము ఎలా తినాలని ప్రశ్నించారు. ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిందిగా వారు కోరారు.

జి.మాడుగులలో ట్రాఫిక్ జామ్


మండల కేంద్రంలో నిలిచిపోయిన వాహనాలు

జి.మాడుగుల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ట్రాఫిక్ జామ్ అయ్యింది. జాతీయ రహదారి 516ఈ పనుల కారణంగా రహదారికి ఇరు వైపులు గోతులు తీసి వదిలేశారు. ఆయ పనులు చేపట్టకపోవడంతో వాహనాలు రోడ్డు మీదనే నిలిపాల్సిన దుస్థితి ఏర్పడింది.దీంతో భారీ వాహనాలు రాకపోకల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ఆ సమయంలో పాదచారులు నడవడానికి కూడా వీలుకావడం లేదు. పైగా రహదారికి ఇరువైపులు దుకాణాలు ఏర్పాటు చేయడం కూడా ఒక కారణంగా మండల కేంద్రం వాసులు చెబుతున్నారు.

బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా పాంగి


పాంగి మత్స్యకొండబాబు

పాడేరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా పాంగి మత్స్యకొండబాబును నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం.శాంతకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హుకుంపేట మండలం మఠం గ్రామానికి చెందిన మత్స్యకొండబాబు ప్రస్తుతం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈక్రమంలో బీజేపీ జిల్లా కమిటీలో ఆయనకు జిల్లా మీడియా కన్వీనర్‌గా నియమించారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను చక్కగా నిర్వహిస్తానని మత్స్యకొండబాబు పేర్కొన్నారు.

'జీవరాశులను కాపాడుకోవాలి'

చింతపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి):అడవుల వ్యాప్తికి ఉపకరించే సమస్త జీవరాశులను కాపాడుకోవాలని గ్రీన్ క్లైమెట్ బృందం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. సోమవారర మండలంలోని తాజంగి జలాశయం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న పక్షులపై ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పలు రకాల పక్షలు, జీవరాసులు అడవుల వ్యాప్తికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నాయన్నారు. పక్షలను సంరక్షించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. సిఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశి ప్రభ మాట్లాడుతూ జీవరాసులను కాపాడుకోవాల్సిన బాధ్యత మానవులపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నర్సింగ్, శ్రీనివాస్, రాజు, రాకేశ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : ఏవో


వామగెడ్డలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో మధుసూదనరావు

చింతపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్థానిక వ్యవసాయాధికారి మధుసూదనరావు అన్నారు. సోమవారం చౌడుపల్లి సచివాలయంలో కౌలు రైతులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం వామగెడ్డలో గిరిజన రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ కౌలు రైతులకు భూమి లేకపోయినప్పటికీ రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ, రాయితీ విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశిస్తుందన్నారు. కత్తెర పురుగు నివారణకు 5మిల్లీ లీటర్ల వేప నూనె లీటరు నీటిలో కలుపుకుని మొక్కల సుడుల్లో పోసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పరమేశ్వరరావు, శోభన్, ఏపీసీఎన్ఎఫ్ ఇన్‌చార్జి మోహన్ పాల్గొన్నారు.

బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు సన్మానం

చింతపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.శనివారం సచివాలయాల నుంచి బదిలీ అయిన ఎనిమిది మంది ఉద్యోగులకు పంచాయతీ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పేట్ల రాజుబాబు, సీపీఐ మండల కార్యదర్శి పోతురాజు, పంచాయతీ కార్యదర్శి కోన శివ, ఉప సర్పంచ్ ఉత్తర కుమారి, మాజీ సర్పంచ్ కిముడు బెన్నెలింగం, కూటమి నాయకుడు కిముడు పరమేశ్వరరావు, కిముడు నారాయణరావు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

» జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బాబూ షూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మండల విస్తృత స్థాయి సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, గెలిచిన తరువాత హామీలను విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ఆమె అన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మీ, ఎంపీపీ ఎ.సీతమ్మ, నాయకులు పాల్గొన్నారు.

కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజుకు ఘన సత్కారం

అనంతగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం పంచాయతీ కేంద్రానికి చెందిన శెట్టి రాజును కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడిగా నియమించడంతో సోమవారం ఘనంగా సత్కరించారు. కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ హెచ్‌ఆర్.మురళీధర్, అసిస్టెంట్ అధికారి వి.రమేశ్ సోమవారం కోనాపురం గ్రామానికి చేరుకుని శెట్టి రాజును సన్మానించారు. ఈ సందర్భంగా శెట్టి రాజు మాట్లాడుతూ కాఫీ తోటలను మరింత విస్తరించేందుకు కృషి చేయడమే కాకుండా గిరిజన ఆర్థికంగా ఎదిగేలా పనిచేస్తానని చెప్పారు. ఇప్పటివరకు కాఫీ తోటలు ఎంత మేరకు విస్తరించి ఉన్నాయి.. ఇంకా కాఫీతోటల పెంపకానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే ఒక్కో యూనిట్ పరిధిలోని స్థానిక ఉత్సాహవంతులైన వారిని అధ్యక్షులు, కార్యదర్శులను నియమించుకుని సమన్వయంతో ముందుకు సాగుతామని చెప్పారు.

లంబసింగిలో మంచు సోయగం

చింతపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగిలో సోమవారం ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. అనంతరం సాయంత్రం మూడు గంటల వరకు ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి వరకు చిరుజల్లుల వర్షం కురుస్తూ పొగ మంచు పడింది. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. కాగా లంబసింగి మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు, సందర్శకులు మంచు అందాలను కెమెరాలో బంధించారు.


లంబసింగి చెక్‌పోస్టు వద్ద ఉదయం కురుస్తున్న మంచు

గిరిజనులకు న్యాయం చేసేది కూటమి ప్రభుత్వమే

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

» వైసీపీ హయాంలో గిరిజనులకు అన్యాయం


విలేకర్లతో మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పరంగా కూటమి ప్రభుత్వమే గిరిజనులకు న్యాయం చేస్తుందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో3 రద్దు అయిన తర్వాత గత వైసీపీ ప్రభుత్వం న్యాయం చేసేందుకు కనీసం చర్యలు చేపట్టలేదన్నారు. 2020లో జీవో3 రద్దయిన తర్వాత నాలుగేళ్లు వైసీపీ అధికారంలో ఉన్నా జీవో 3 పునరుద్ధరణకు లేదా అదే జీవో తరహాలో మరో జీవోను రూపొందించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. కాని కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా జీవో3 రద్దుతో అన్యాయానికి గురైన గిరిజనులకు న్యాయం చేసేందుకు అనేక చర్యలు చేపడుతుందన్నారు. గిరిజనులకు ఉద్యోగ రిజర్వేషన్లపై న్యాయం చేయాలనే ఆలోచనతో ఇప్పటికే అనేక అధ్యయనాలు, న్యాయ సలహాలు, సూచనలు తీసుకుంటున్నారన్నారు. ఐటీడీఏల వారీగా వర్క్‌షాప్‌లు నిర్వహించి, గిరిజనుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇదే కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడుకు గిరిజనుల పట్ల ఉన్న శ్రద్ధను స్పష్టం చేస్తుందన్నారు. గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వం, తమ సమస్యలపై నోరెత్తితే కేసులు పెట్టిన సంగతి గిరిజనులు మర్చిపోలేదన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ఆందోళనకారులతో చర్చలు జరపడం, వారి అభిప్రాయాలకు పరిగణనలోకి తీసుకోవడం అన్ని కోణాల్లో సూచనలు, సలహాలను సేకరించి న్యాయం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణ, తామర్ల సత్యనారాయణ, త్రినాథ్, శశిభూషన్‌ప్రసాద్, అచ్చిబాబు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ


జిల్లా ఆస్పత్రిలో నవజాత శిశువును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

పాడేరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. ప్రధానంగా మాతా శిశువులకు సంబంధించిన వైద్య సేవలను పక్కాగా అందించాలన్నారు. అలాగే పలువురు శిశువుల ఆరోగ్యాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం మండలంలో మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నరసింగరావు, పీహెచ్‌సీ డాక్టర్లు వి.సాయిశ్రీ, జి.మనోజ్ఞ, ఆరోగ్యవిస్తరణాధికారి జి.సింహాద్రి, హెల్త్ సూపర్‌వైజర్ల ఎం.సంజీవ్‌పాత్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పీ4తో ప్రజలకు మేలు : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4తో ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరిగిందని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. సోమవారం మొండిగెడ్డ పంచాయతీ కార్యాలయంలో పీ4పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో వెనుకబడిన కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పేద కుటుంబాలను ఆర్థికంగా మెరుగ్గా ఉన్నవారు దత్తత తీసుకొని వారి అభివృద్ధికి పాటుపడతారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయుడు ముర్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర


గత్తరగుడలో గిరిజనులకు ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందిస్తున్న దొన్నుదొర

అరకులోయ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందడం సాధ్యమని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. కొత్తభల్లుగుడ పంచాయతీలోని గత్తరగుడ గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాల్లో రహదారులు అభివృద్ధి చెందుతున్నాయని, తాగునీటి సదుపాయం సమకూరుతుందని ఆయన చెప్పారు. బడిఈడు పిల్లలంతా పాఠశాలలకు వెళ్లి, చక్కగా చదువుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఒక్క విద్యార్థికి మాత్రమే డబ్బులు వేసిందని, కూటమి ప్రభుత్వం కుటుంబంలోని ఇంటర్ వరకు చదువుకున్న విద్యార్థులందరికీ తల్లికి వందనంలో డబ్బులు జమ చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి నెలా 1వ తేదీన ఉదయానికే సచివాలయ ఉద్యోగులు ఇంటికి వచ్చి పింఛన్లు అందిస్తున్నారని, ఆ సమయంలో లేనివారు మూడు నెలల పాటు ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించిందని దొన్నుదొర పేర్కొన్నారు. ప్రతీ ఇంటిని సందర్శించి వారి బాగోగులను గురించి ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గిరిజనులకు ఆయన అవగాహన కల్పించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ పెట్టెలి బాలు, బూత్ ఇన్‌చార్జి కిల్లో జీనబందు, నాయకులు ఎస్.నాగరాజు, వెంట్రావు, చందు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ

అనంతగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థి సంఘం నాయకులతో సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ వీరభద్రచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు చంటి మాట్లాడుతూ కళాశాల ఏర్పాటు చేసి 20 ఏళ్లు పైబడినప్పటికీ కనీసం బాలుర వసతిగృహం ఏర్పాటు చేయలేదని, దీంతో అద్దె రూమ్‌ల్లో ఉంటూ బాలురు చదువుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.2.5 కోట్ల ట్రైబల్ వెల్ఫేర్ నిధులతో ప్రారంభించిన భవనం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని, బాలికల వసతిగృహంలోని పలు సమస్యలు తాండవం చేస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోని నాయకులు అనిల్, రవీంద్ర, స్వామి, బుద్ధు, కృష్ణబాబు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి: జడ్పీటీసీ


గిరిజనులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు డిమాండ్ చేశారు. రొంపల్లి పంచాయతీ కరకవలస గ్రామంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో ఆయన మాట్లాడుతూ 17 కుటుంబాలకు చెందిన గిరిజనులు భూములను సాగు చేసుకుంటే, ఏడుగురికి మాత్రమే ఎల్‌పీసీ ఇచ్చారన్నారు. దీంతో మాజీ సైనికులకు, గిరిజనులకు మధ్య వివాదం నడుస్తోందన్నారు. గిరిజన రైతులకు సాగు పత్రాలను ఇచ్చేలా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి, గ్రామస్థులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

» అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


కిలగాడ పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

ముంచంగిపుట్టు, జులై 21 (ఆంధ్రజ్యోతి): రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మండలంలోని కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ఎంత మంది విధుల్లో ఉన్నారో ఆరా తీశారు. సమయం 11 గంటలు కావస్తున్నా విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఎమ్మెల్యే ఆదేశించారు. సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రస్తుతం వ్యాధులు సీజన్ కావడంతో గ్రామాల్లో పలు రకాల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అలాగే గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, జ్వర బాధితులకు విధిగా జ్వర నిర్ధారణ పరీక్షలు చేయాలని, వారికి అవసరమైన మందులు అందించాలని చెప్పారు. సీహెచ్‌సీలో నిత్యం అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం కిలగాడ కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వనరులను సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యార్థినిలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీడీ రజనిపై చర్యలు తీసుకోవాలి

దండకారణ్య విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

సీలేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యోగిని వ్యాపారంలోకి దింపి అధికార దుర్వినియోగానికి పాల్పడిన గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రజనిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దండకారణ్య విమోచన సమితి అల్లూరి జిల్లా అధ్యక్షుడు కె.మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడూతూ వాచ్‌మన్ ఉదయ్‌ను పావులా వాడుకుని మిరియాలు, కాఫీ వ్యాపారం చేయించి అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. బాధితుడు ఉదయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌ఓ బయటపెట్టిందని, ఇది ఓర్వ లేక ఆమె కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులతో బెదిరింపు చర్యలకు పాల్పడడమే కాకుండా కొంతమంది ఉపాధ్యాయ సంఘం నాయకులను ఉదయ్ వద్దకు పంపించి లొంగదీసుకునే ప్రయత్నం చేశారన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కొండలరావు, బొంజుబాబు


కొండలరావు


బొంజుబాబు

జి.మాడుగుల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమవారం ఎన్నికయ్యారు. ఆదివారం అనకాపల్లిలో పార్టీ నాయకులు మండల నేతలతో చర్చలు జరిపి నూతన అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా వంతాల కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా కొర్రా బొంజుబాబులను ఎంపిక చేశారు. కాగా కొండలరావు గతంలో మండల అధ్యక్షుడిగా పనిచేశారు. తాజాగా మరల ఆయన్ని కొనసాగించడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మండల అధికారులను కలిసిన జీసీసీ బీఎం

జి.మాడుగుల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీసీసీ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.బాబూరావు సోమవారం పలువురు మండల అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత తహసీల్దార్ జి.రాజ్‌కుమార్‌ను కలిసి అరకు కాఫీని అందజేశారు. అలాగే ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, ఎంపీపీ ఎల్.అప్పలరాజులను కలిశారు. ఈ సందర్భంగా అన్ని రేషన్ దుకాణాల్లో నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మన్ నిరీక్షణరావు, సిబ్బంది సుబ్బారావు, విక్రమ్ పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ నిర్వాహకులను తొలగిస్తే ఆందోళన


ఎంఈవో బోడం నాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చింతపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను తొలగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సోమవారం మిడ్డే మీల్స్ నిర్వాహకులతో కలిసి తహసీల్దార్ ఆనందరావు, ఎంఈవో గెమ్మెలి బోడం నాయుడులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు నిర్వాహకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కొంత మందిని నిర్వాహకులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చిన్నగెడ్డ, రింతాడ పాఠశాలల్లో నిర్వాహకులను తొలగించారన్నారు. ఈచర్యలను తక్షణమే నిలుపుదల చేయాలని, లేదంటే చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు సాగిన చిరంజీవి, నిర్వాహకుల సంఘం నాయకులు పద్మ, జ్యోతి, సింహాచలం పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవికి పంచలోహ ఆభరణాలు వితరణ


ఆలయ ధర్మకర్తకు ఆభరణాలను అందిస్తున్న సోమరాజు దంపతులు

పాడేరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు పూర్ణపుష్కలాంబ సహిత అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన మహాలక్ష్మీదేవికి పంచలోహాల కిరీటం, అమ్మవారికి హస్తాలను పట్టణానికి చెందిన ఉడా సోమరాజు, రామలక్ష్మి దంపతులు సోమవారం సమర్పించారు. వాటిని ఆలయ కమిటీ ప్రతినిధుల సమక్షంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా సోమరాజు దంపతులను ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రొబ్బి రాము, అనీల్‌కుమార్, రామకృష్ణ, దామోదరం, ఆదిత్య, నాయుడు, సత్తిబాబు, వర్మ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం మృతికి సీపీఎం సంతాపం

పాడేరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన కేరళ మాజీ సీఎం వీఎస్.అచ్యుతానందన్(101)కి సీపీఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలిపింది. అచ్యుతానందన్ మృతి విషయం తెలిసిన వెంటనే పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సంతాప సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడుగా అనేక పోరాటాల్లో కీలకమైన వ్యక్తిగా వ్యవహరించారన్నారు. కేరళ అసెంబ్లీకి 7 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన 2006 నుంచి 2011 వరకు కేరళ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలు అందించారని వివరించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వనభంగి పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

పెదబయలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనభంగి పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎంపీపీ బొండా వరహాలమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. వనభంగి కాలనీ నుండి జడిగూడ గ్రామానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గిరి గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పంచాయితీలోని జడిగూడ, డి.పేడపల్లి, దుమ్మగూడ, తోటలగొంది, పనసపుట్టు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి పథకం ద్వారా కలెక్టర్ రూ.57 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేఈ సివరామయ్య, వైస్ ఎంపీపీ రాజుబాబు, వనభంగి సర్పంచ్ కాసులమ్మ, వార్డు సభ్యులు బాలరాజు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. స్వచ్ఛత మాయం!

- ▸▸ చోడవరంలో కలుషిత తాగునీటి సరఫరా
- ▸▸ రెండు రక్షిత పథకాలకూ నిర్వహణ కరువు
- ▸▸ ట్యాంకుల మెట్లు విరిగిపోవడంతో సమస్య
- ▸▸ గత్యంతరం లేక కలుషిత నీరే తాగుతున్న జనం

నియోజకవర్గ కేంద్రంలో తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. 'స్వచ్ఛ'మైన నీరు అందుబాటులో లేకపోతోంది. అధికారుల నిర్లక్ష్యంతో రక్షిత నీటి పథకాల నిర్వహణ లోపించి కలుషితమైన నీరే దిక్కవుతోంది.



ఎడ్లవీధిలో రక్షిత నీటి పథకాల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీరు







ఎడ్లవీధిలోని రెండు రక్షిత పథకాల ట్యాంకులకు విరిగిపోయిన మెట్లు

చోడవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఓవైపు వర్షాలు కురుస్తుండడంతో ప్రజలను అంటువ్యాధుల భయం వెంటాడుతోంది. దీనికితోడు రక్షిత నీటి పథకాల ద్వారా బురద, కలుషితమైన తాగునీరు సరఫరా కావడంతో వారు మరింత భయాందోళన చెందుతున్నారు. మేజర్ పంచాయతీ చోడవరంలోని ఎడ్లవీధితో పాటు పరిసర వార్డుల్లో కొద్దిరోజులుగా ఈ దుస్థితి ఉంది.

ఎడ్లవీధిలో రక్షిత నీటి పథకాల ద్వారా కొద్ది రోజుల క్రితం కలుషిత నీరు సరఫరా కావడంతో స్థానికులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పంచాయతీ సిబ్బంది కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టారు. తిరిగి ఆదివారం నుంచి మళ్లీ కొళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఎడ్లవీధిలోని రెండు మంచినీటి పథకాల ట్యాంకులకు నిర్మించిన మెట్లు శిథిలమయ్యాయి. ఈ మెట్లు ఎక్కడానికి అనువుగా లేకపోవడంతో ఈ ట్యాంకులను పరిశుభ్రం చేయడం లేదు.

గతంలో ఉన్న మంచినీటి పథకాలకు ఉన్న మెట్లు విరిగిపోవడంతో అదే ట్యాంకుకు కొత్తగా మెట్లు నిర్మించారు. అయితే నిర్మించిన రెండు మెట్లు కూడా ప్రస్తుతం ఎక్కేందుకు వీలులేకుండా విరిగిపోయాయి. ఇక కొత్తగా నిర్మించిన మంచినీటి పథకానికి సంబంధించిన మెట్లు కూడా అక్కడక్కడా విరిగిపోయాయి. దీంతో ఈ రెండు పథకాల ట్యాంకు నిర్వహణ కొరవడుతోంది. ట్యాంకుల మెట్లను సిబ్బంది ఎక్కడం లేదు. ఫలితంగా ఈ రెండు ట్యాంకుల ద్వారా కలుషిత నీరే సరఫరా అవుతున్నది. దీంతో కలుషితమైన నీరే ప్రజలకు దిక్కవుతోంది. గత్యంతరం లేక ఈ నీటినే తాగుతున్నారు. ఈ క్రమంలో వ్యాధుల భయంతో వారు వణికిపోతున్నారు. కనీసం రెండు, మూడు నెలలకోసారైనా ట్యాంకులు పరిశుభ్రంతో పాటు క్లోరినేషన్ చేయిస్తే బాగుండేదని, ట్యాంకుల మెట్లు సరిగా లేకపోవడంతో ఈ ప్రక్రియ అమలుకావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఈ రెండు ట్యాంకుల ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు 40 వినతులు



పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదికలో 40 అర్జీలు అందాయి. వీటిని ఆర్డీవో వీవీ రమణ స్వీకరించారు. తల్లికి వందనం డబ్బులు పడలేదని పలువురు లబ్ధిదారులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అలాగే కోటవురట్లకు చెందిన కామిరెడ్డి బుచ్చిరాజు, నర్సీపట్నానికి చెందిన కుత్సం అప్పర్ణ, వేమవరపు పార్వతి, రోలుగుంట మండలం కొంతలం గ్రామానికి చెందిన కేశవరపు చిన్నరమణ తదితరులు తల్లికి వందనం మంజూరు చేయాలని విన్నవించారు. పెదబొడ్డేపల్లికి చెందిన పోతురాజు నారాయణరావు డ్రైనేజీ సమస్య పరిష్కరించేలా మునిసిపల్ అధికారులను ఆదేశించాలని వినతిపత్రం అందజేశారు. ఎస్.రాయవరానికి చెందిన కర్రి సుబ్బాజీ ఫ్యామిలీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గాయపడిన మహిళకు వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం అందజేశారు. పట్టణానికి చెందిన బ్రాహ్మణ మహిళ భమిడిపాటి లక్ష్మి ప్రమాదవశాత్తు గాయపడడంతో ఆపరేషన్ చేయించారు. అయినప్పటికీ ఇటీవల ఆమె మృతి చెందారు. లక్ష్మికి ఆపరేషన్‌కు అవసరమైన నిధులు సీఎం సహాయనిధి నుంచి రూ.43 వేలు మంజూరు కాగా, ఈ చెక్కును ఆమె కుమారుడు సంతోశ్‌కు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, ఎంపీటీసీ సభ్యుడు కొట్యాపు చిన్న, టీడీపీ నాయకులు చిన్న, ముక్కవిల్లి విస్సు, వార్డు సభ్యులు సంతోశ్, దివ్య. ఎస్.వెంకటరావు, బి.ఈశ్వరరావు. రావాడ శ్రీను పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఏడు రంగుల బెడ్‌షీట్లు



ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కౌన్సిలర్ పద్మావతి

నర్సీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలో ఏడు రోజులు ఏడు రంగుల బెడ్‌షీట్లను ఉపయోగించడానికి సిద్ధం చేసినట్టు 26వ వార్డు కౌన్సిలర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు చింతకాయల పద్మవతి తెలిపారు. సోమవారం ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, శస్త్ర చికిత్స, జనరల్ వార్డుల్లో మంచాలకు వారంలోని ఏడు రోజులు ఏడు రంగుల బెడ్ షీట్లు అందుబాటులో వస్తాయని తెలిపారు. ఆస్పత్రిలో గతంలో కంటే రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ పర్యవేక్షణతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధాశారద పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



పీఏసీఎస్ పాలకవర్గం ప్రతినిధులను సత్కరిస్తున్న రాజేశ్

నర్సీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఛైర్‌పర్సన్‌గా రుత్తల కృష్ణ, సభ్యులుగా బయపురెడ్డి చిన్నబాబు, పొన్నాడ అప్పకొండతో సీఈవో ఎస్.పైడిరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. వారికి 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కృష్ణ మాట్లాడుతూ రైతులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గవిరెడ్డి రమణ, వైస్ ఛైర్మన్ చిటికెల కన్నయ్యనాయుడు, రావణాపల్లి నీటి సంఘం అధ్యక్షుడు రుత్తల రాజేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈర్లి రాజబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నవ్య లయన్స్ క్లబ్ పాలకవర్గం...

బలిఘట్టం లయన్స్ కమ్యూనిటీ భవనంలో ఆదివారం రాత్రి నవ్య లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా కర్రి రాంగోపాల్, కార్యదర్శిగా బి.విజయ్‌కుమార్, కోశాధికారిగా ఎన్.సుధీర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎంజేఎఫ్ ఛైర్‌పర్సన్ చెరుకూరి ఇందిర, లయన్స్ క్లబ్ కార్యదర్శి టి.రామారావు, ట్రెజర్ బి.సీతారామశర్మ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధుల ధ్వజం

సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నల వర్షం

సభ్యుల ప్రశ్నలతో అధికారులకు ఎమ్మెల్యే బండారు క్లాస్

వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



సమావేశంలో వెలుగు ఏపీఎంను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

దేవరాపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శాఖల అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. రెవెన్యూ, వెలుగు, ఉపాధి హామీ పథకం తదితర శాఖల అధికారులపై ఎమ్మెల్యే సమక్షంలోనే మండిపడ్డారు. సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని బి.కింతాడలో తొమ్మిది సెంట్ల భూమి ఆక్రమణకు గురవడమే కాకుండా రెవెన్యూ అధికారులు కొంత మంది వ్యక్తుల పేరుపై రాసి ఇచ్చారని సర్పంచ్ బూరే బాబూరావు ధ్వజమెత్తారు. అక్కడ వీఆర్వోలు ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. తహశీల్దార్ లక్ష్మీదేవీ మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ గోడ సమస్య పరిష్కరించామని, ఆక్రమణ భూమిపై క్షేత్ర స్థాయిలో తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎ.కొత్తపల్లి పాఠశాలకు ప్రహరీ గోడ, తాగునీటి సదుపాయాలు లేవని సర్పంచ్ వెంకటసత్యనారాయణ సభ దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే స్పందిస్తూ జలజీవన్ మిషన్ కింద నీరు అందించి, పాడైన బోరును తొలగించాలని ఆదేశించారు. అలాగే ప్రహరీ గోడ కోసం ప్రతిపాదనలు పంపాలని ఎంఈవోను ఆదేశించారు. గ్రామాల్లో పేదల సొమ్ము ఇష్టం వచ్చినట్టు వృథా చేస్తున్నారని, వేచలంలో వెలుగు వీవోఏ రూ.10 లక్షలు స్వాహా చేశారని, సీసీలు, వీవోఏలు, ఏపీఎం సైతం ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని, కొంత మంది ఇళ్లల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, సర్పంచులు శటారినాయుడు, చింతల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు,తదితరులు ధ్వజమెత్తారు. వాలాబులో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, గర్సింగిలో జ్వరాలు వస్తున్నాయని సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పోడెల వెంకటలక్ష్మి, గోపి తెలిపారు. వేచలం పీహెచ్‌సీ పరిధిలోని తిమిరాం సంతలో కొబ్బరిబొండాలు విచ్చలవిడిగా వదిలి పెడుతున్నారని, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు తెలిపారు. గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వైద్యులను ఆదేశించారు. దేవరాపల్లి, చోడవరం, ఎస్‌కోట, చోడవరం బస్సులను పునరుద్ధరించాలని సర్పంచ్ బాబూరావు కోరారు. కాగా సమావేశానికి గైర్హాజరైన ఎస్ఎస్ఏ ఏఈఈకి నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో ఏవో లక్ష్మీనారాయణ, ఉపాధి పథకం ఏపీవో రుక్మిణి, వెలుగు ఏపీఎం ప్రభాకర్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ కార్యాలయం ఆధునికీకరణకు ప్రతిపాదనలు

'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన



రోగులకు మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది.. (ఇన్‌సెట్‌లో) ఆర్అండ్‌బీ కార్యాలయ భవనం

నర్సీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ డివిజన్ కార్యాలయం ఆధునికీకరణకు ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు కోరారు. 'పురాతన భవనంలో బిక్కుబిక్కుమంటూ విధులు' అనే శీర్షికన ఈ నెల 7వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనికి ఆర్అండ్‌బీ బిల్డింగ్స్ భాగం చీఫ్ ఇంజనీర్ మాధవీసుకన్య స్పందించారు. ఈ మేరకు నర్సీపట్నం డివిజన్ కార్యాలయం అధికారులను వివరణ కోరారు. భవనం ఆధునికీకరణ పనులకు తక్షణమే రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. చాలా కాలంగా ఉన్న కార్యాలయం సమస్యకు పరిష్కారానికి మార్గం సుగమమైందని స్థానిక అధికారుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తమ్మయ్యపాలెంలో వైద్య శిబిరం

మాకవరపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మయ్యపాలెం గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే వెంకటాపురం గ్రామంలో చెత్త కుప్పలను తొలగించారు. 'తమ్మయ్యపాలెంలో జ్వరాలు', 'జి.వెంకటాపురంలో చెత్త కుప్పలు' అనే శీర్షికలతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు ఆయా శాఖల అధికారులు స్పందించారు. ఈ మేరకు తమ్మయ్యపాలెంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు పరీక్షలు చేశారు. అలాగే ఇంటింటికీ వెళ్లి జర్వాలు ఉన్న వారి వివరాలను సేకరించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఎక్కడికక్కడ బ్లీచింగ్ చల్లించారు. అలాగే జి.వెంకటాపురం గ్రామంలో చెత్తను తొలగించారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్‌ను చల్లారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మేరీ జాన్స్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు అడ్డుకోవడం తగదు



శ్మశానవాటిక వద్ద ఆందోళన చేస్తున్న కూటమి నాయకులు

కృష్ణాదేవిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిక నిర్మాణ పనులను వైసీపీ సర్పంచ్ అడ్డుకోవ డం తగదని టీడీపీ, జనసేన నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం సిహెచ్.నాగాపురం గ్రామంలో శ్మశాన వాటిక వద్ద వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అక్కడ సమాధులను చూపించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు కొలగాని రామారావు, బొప్పన ప్రసాద్, సేనాపతి వరహాల బాబు, రేగుబల్ల శివ మాట్లాడుతూ పాఠశాలకు 150 మీటర్ల దూరంలో నిర్మిస్తున్నప్పటికీ రాజకీయ కక్షతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని అడ్డుకోవాలనే తప్పుడు ఫిర్యాదులతో ఇలా చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో పలువురు మృతి చెందితే, ఈ శ్మశావాటికలోనే దహనం చేసిన విషయం తెలుసుకోవాలని వారు హితవు పలికారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేనప్పుడే ఇక్కడ దహన సంస్కారాలు చేసేవారని, ప్రస్తుతం ప్రహరీ గోడ ఉందని, శ్మశానవాటిక ప్రహరీ గోడకు కూడా త్వరలో నిధులు విడుదల అవుతారని వారు తెలిపారు. తప్పుడు ఫిర్యాదులతో శ్మశానవాటిక నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తే ఆందోళన తప్పదని టీడీపీ, జనసేన నాయకులు, గ్రామ స్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ జైతి అప్పారావు, టీడీపీ, జనసేన నాయకులు సత్తిబాబు, నాగేశ్వరావు, జగ్గయ్యదొర, సూరిబాబు, మురళి, గణేశ్, డి.వెంకటరమణ పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం





చోడవరం, కృష్ణాదేవిపేట ప్రధాన రహదారుల్లో దంచికొడుతున్న వాన

నర్సీపట్నం/చోడవరం/బుచ్చెయ్యపేట/గొలుగొండ/కృష్ణాదేవిపేట/దేవరాపల్లి/చీడికాడ/కె.కోటపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం భారీ వర్షం కురిసింది. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో వాన దండి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నర్సీపట్నంలో మధ్యాహ్నం 4 గంటల నుంచి గంటన్నర సేపు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. బ్యాంక్ కాలనీ, వెంకునాయుడుపేట స్కూల్ రోడ్లు చిత్తడిగా తయారయ్యాయి. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నీరు నిలిచిపోవడంతో చెరువును తలపించింది. మెయిన్ రోడ్డులో కార్ల స్టాండ్, ఎస్‌కే పీటీ సెంటర్, ఆర్టీసీ కూడలిలో డ్రైనేజీ నీరు రోడ్డు మీద పారింది. చోడవరం మండలంలో సాయంత్రం భారీ వర్షం దంచి కొట్టింది. 3 గంటల నుంచి గంటన్నరకుపైగా ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. అడ్డూరు వద్ద కొండగెడ్డ పొంగడంతో, చోడవరం, విశాఖపట్నం మధ్య వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. కృష్ణాదేవిపేటలో పది రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు సోమవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది.

గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో కుండపోత వర్షం పడింది. కృష్ణాదేవిపేట-కొంగసింగి రహదారిపై నీరు ఏరులా పారింది. కె.కోటపాడు పరిసర గ్రామాల్లో మధ్యా హ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.



దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

దేవరాపల్లి మండలంలో ఉదయం ఎండ కాయగా, మధ్యాహ్నం రెండు గంటలకు కుండ పోత వర్షం ప్రారంభమైంది. కూరకాయల పంటకు ఇది ఎంతో మేలు చేకూర్చింది. చీడికాడతో పాటు పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. బుచ్చెయ్యపేట మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. వరి పంటకు ఇది లాభదాయకమని రైతులు తెలిపారు. గంటకు పైగా ఉరుములతో వాన పడింది.

ప్రజలకు పథకాలను వివరించండి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కార్యకర్తలకు సూచించారు. మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పథకాల కరపత్రాలను ప్రజలకు పంచి పెట్టారు. అనంతరం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ఏసుదాసు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్

మాకవరపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైసీపీ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. 737 సర్వే నంబరులో వేస్తున్న వాకరోడ్డుకు వైసీపీ అడ్డుకాదని, తాము సహకరిస్తామని చెప్పారు. అయితే రోడ్డు ఏ శాఖ వేస్తుందో తెలియపరచాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వం, మండల అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

బుచ్చెయ్యపేట, జూలై 21 (ఆంధ్ర జ్యోతి): పీహెచ్‌సీల్లో టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం తనిఖీలు చేపట్టారు. పొట్టిదొరపాలెం హెల్త్, వెల్నెస్, సెంటర్‌లో రికార్డులు పరిశీలించారు. బాలింతలు, బాలికల వివరాలు ఆధారంగా వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు ఎ.రామచంద్రరావు, డీపీవో కె.జగదీశ్, డేటా మేనేజర్ వై.జనార్ధన్, పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రమేశ్ పాల్గొన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ

చీడికాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాయితీపై ఎరువులు పంపిణీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తురువోలు సర్పంచ్ మట్టా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు బీళ్ల కోటేశ్వరరావు చెప్పారు. తురువోలు రైతు సేవా కేంద్రం వద్ద కాంప్లెక్స్ ఎరువులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాయితీ పోను రూ.270కే ఎరువులు అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, బొడ్డు శ్రీరామ్మూర్తి, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ వెంకునాయుడు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయాలి

చీడికాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని కేంద్రాల్లో పశువులకు టీకాలు వేయాలని పశు వైద్యాధికారిణి కె.రాఘవమ్మ సూచించారు. సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ చీడికాడ మండలానికి 3600 డోసులు అందుబాటులో ఉన్నాయని, పాడి రైతులు మూడు నెలలు దాటిన సంకరజాతి పశువులకు టీకాలు వేయించాలని చెప్పారు. ఇంతవరకూ మండలంలో 1200 టీకాలు వేసినట్టు ఆమె తెలిపారు.

యాప్‌లతో అంగన్‌వాడీలను ఇబ్బందులు పెట్టొద్దు

కె.కోటపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలను రకరకాల యాప్‌లతో ఇబ్బందులు పెట్టవద్దని యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఐసీడీఎస్ పీవోకు సోమవారం వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహారం, ఆరోగ్యం, విద్య అందించడమే ఐసీడీఎస్ లక్ష్యమని, అలాంటిది ప్రతీ దానికి యాప్ ఉపయోగించి ఓటీపీల ద్వారా సరకులు అందించడం తో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సెల్ సిగ్నల్ లేకపోవడం లబ్ధిదారులకు సరకులు ఇవ్వలేకపోతున్నామన్నారు. దీంతో లబ్ధిదారులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక అంగన్‌వాడీలు మానసిక వేదనకు గురవుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పి.భవాని, జి.కుమారి, వరలక్ష్మి, రమణమ్మ, లక్ష్మి, పద్మ, అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

కె.కోటపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే లక్ష్యమని విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ అన్నారు. సోమవారం చౌడువాడ పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 650 మంది పాడి రైతులతో సొసైటీ లాభాలతో నడుస్తుందన్నారు. ప్రతి ఏటా పాడి రైతులకు బోనస్ రూపంలో అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది రూ.4.11 కోట్ల వ్యాపారం నిర్వహించగా, రైతులకు రూ.3.97 కోట్ల బట్వాడా చేశామన్నారు. ఈ సంవత్సరం రైతుల సంక్షేమానికి రూ.26 లక్షలు ఖర్చు చేయగా, డబల్ బోనస్‌గా రూ.34 లక్ష లక్షలు అందించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కేవీ రమణ, కోపరేటివ్ సొసైటీ ఛైర్మన్ రాజి నాని, సొసైటీ కార్యదర్శి చిన్ని వెంకట నరసింహమూర్తి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రాజేశ్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవో-2గా మోహన్‌రావు

రోలుగుంట. జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంఈఓ-2గా కుసర్లపూడి జడ్పీ పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహన్‌రావును నియమిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఆర్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-2 జగ్గారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఎంఈఓ-2 విధులకు ఇబ్బందులు కలగకుండా ఇన్‌చార్జి బాధ్యతలను మోహన్‌రావుకు అప్పగించారు.

భూ సేకరణ ప్రతిపాదన వద్దు

బుచ్చెయ్యపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు నష్టం కలిగించే భూ సేకరణ ప్రతిపాదన తక్షణమే నిలిపివేయాలని రైతుకూలీ సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని ఆర్‌భీమవరం, చిన భీమవరం, ఆర్.శివరాంపురం, అప్పంపాలెం, ఎం.భూపతిపాలెం, పెదమల్లాం, చిన మల్లాం గ్రామాల్లో 1690.11 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదనలు చేశారని, దీనికి అధికారులు తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహించారని చెప్పారు. నాయకులు కోన మోహనరావు, సిహెచ్.రమణ, శ్రీనివాసరావు, ఎం.నాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలతో ఉపాధి

అచ్యుతాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సరుగుడు, నీలగిరి నారు పెంపకానికి మండలంలోని పూడిమడక గ్రామం చిరునామాగా నిలిచింది. ఇక్కడ సుమారు వంద కుటుంబాలకు చెందిన మత్స్యకారులు ఏటా వేసవిలో దాదాపు 20 ఎకరాల్లో నర్సరీల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇసుక నేలలు కావడంతో నాణ్యమైన నారు ఉత్పత్తి అవుతున్నది. అనకాపల్లితోపాటు కాకినాడ, విజయనగరం జిల్లాల నుంచి రైతులు ఇక్కడకు వచ్చి సరుగుడు, నీలగిరి నారును కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు.

- సరుగుడు, నీలగిరి నారుకు కేరాఫ్ పూడిమడక
- ఇసుక నేలలు కావడంతో త్వరగా పెరుగుదల
- ఏటా వేసవిలో ఇరవై ఎకరాల్లో మొక్కల పెంపకం
- వంద కుటుంబాలకు నాలుగు నెలలపాటు జీవనోపాధి


మడులను నీటితో తడుపుతున్న మహిళ


పూడిమడక తీరంలో సరుగుడు, నీలగిరి నారు మడులు

అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల సరుగుడు నర్సరీలు వున్నప్పటికీ పూడిమడకలో పెంచే నారుకు గిరాకీ ఎక్కువ. ఇక్కడ ఇసుక దిబ్బల్లో సరుగుడు నారు పెంచడంవల్ల మొక్కలు ఏపుగా పెరుగుతాయి. నారు తీసేటప్పుడు వేర్లు తెగిపోకుండా దుబ్బుగా వస్తాయి. దీనివల్ల పొలంలో నాటిన తరువాత చనిపోయే మొక్కలు చాలా తక్కువ వుంటాయి. ఈ కారణంగానే పూడికమడక సరుగుడు, నీలగిరి నారుకు డిమాండ్ అధికం.

వంద కుటుంబాలకు ఉపాధి

పూడిమడకలో సుమారు వంద కుటుంబాలకు చెందిన మత్స్యకారులు ఏటా సరుగుడు, నీలగిరి నారుని పెంచుతుంటారు. సొంత భూమి లేని వారు ఇతరుల నుంచి భూమిని కౌలుకు తీసుకుంటారు. ఏటా ఫిబ్రవరి/ మార్చి నెలల్లో నారు పెంపకాన్ని ప్రారంభిస్తారు. తొలుత మూడు లేదా నాలుగు అడుగుల వెడల్పు, 15 నుంచి 20 అడుగుల పొడవుతో మడులు తయారు చేసుకుంటారు. ఎకరాకు సుమారు 20 మడులు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది మొత్తం ఇరవై ఎకరాలకుగాను 18 ఎకరాల్లో సరుగుడు, రెండు ఎకరాల్లో నీలగిరి నారు పెంపకం చేపట్టారు. మడులు సిద్ధం చేసిన తరువాత విత్తనాలు వేసి, రోజూ ఉదయం, సాయంత్రం నీరు చల్లుతారు. ఇసుక నేలలు కావడంతో ఇక్కడ బోర్లు, బావులు వుండవు. నీటి కోసం 50 అడుగుల వ్యాసార్థంతో ఐదారు అడుగుల లోతున చెలమలు తవ్వుకుంటారు. ఒక ఎకరా విస్తీర్ణంలో నారు పెంచడానికి రోజూ నలుగురు మనుషులు శ్రమించాల్సి వుంటుంది. జూన్ చివరి వారం నుంచి నారు అందుబాటులోకి వస్తుంది. ఒక్కో మడిలో ఐదు నుంచి ఆరు వేల చొప్పున ఎకరా విస్తీర్ణంలో లక్షకుపైగా నారు మొక్కలు వస్తాయి. రకాన్నిబట్టి ఒక్కో మొక్క రూపాయి నుంచి రూపాయిన్నరకు విక్రయిస్తుంటారు.

సంతృప్తికర ఆదాయం

- మైలపల్లి పోలమ్మ, దోని గంగోడు సరుగుడు నారు పెంపకందారులు




ఎకరా విస్తీర్ణంలో సరుగుడు నారు పెంపకానికి నలుగురు మనుషులు సమారు నాలుగు నెలలపాటు కష్టపడాలి. మడుల్లో విత్తనాలు వేసినప్పటి నుంచి నారు తీసే వరకు రోజూ నీరు చల్లాలి. మొక్కల అమ్మకం ద్వారా సుమారు లక్ష రూపాయల ఆదాయం వస్తుంది. విత్తనం మాత్రమే కొనుగోలు చేస్తాం. మిగిలిన అన్ని పనులు మేమే చేసుకుంటాం. నాలుగు నెలల్లో ఒక్కొక్కరికి రూ.25 వేల వరకు ఆదాయం వస్తుంది.

బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌చల్

- పెరుగుతున్న వినియోగదారులు
- గడిచిన ఏడాదిలో సుమారు 90 వేల మంది కొత్త కస్టమర్లు చేరిక
- ప్రైవేటు సంస్థల నుంచి మార్పు
- నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకునే దిశగా చర్యలు
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా 620 టవర్లు ఏర్పాటు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సంఖ్య ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెలా వందలాది మంది కొత్తగా నెట్‌వర్క్‌లో చేరుతున్నారు. గడిచిన ఏడాది ప్రైవేటు టెలికాం సంస్థలు టారిఫ్‌ను భారీగా పెంచడంతో వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ వైపు మొగ్గు చూపిస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో బీఎస్ ఎన్‌ఎల్‌కు 5,28,000 మంది వినియోగదారులు ఉన్నారు. అందులో 4.7 లక్షల మంది సెల్ కస్టమర్లు. ఏడాది కాలంలో సుమారు 90 వేల మంది కొత్తగా చేరారు. ఇందులో ఇతర నెట్ వర్క్‌ల నుంచి వచ్చినవారు సుమారు 70 వేల మంది వరకూ ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అదికంగా జియో వినియోగ దారులు ఉన్నారు. ఆ తరువాత స్థానంలో ఎయిర్‌టెల్, వీఐ నెట్‌వర్క్‌లకు చెందిన వినియోగదారులు ఉన్నారు.

నెట్‌వర్క్‌ను విస్తరించే చర్యలు

దేశంలో ఫోన్, ఇంటర్‌నెట్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపట్టింది. ప్రైవేటు టెలికాం సంస్థలు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు టవర్లు ఏర్పాటుచేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేకచోట్ల ప్రైవేటు టెలికాం సంస్థలు టవర్స్‌ను ఏర్పాటు చేశాయి. కాగా, ఫోన్, ఇంటర్‌నెట్ సదుపాయాలను మారు మూల ప్రాంతాలకు అందించేందుకు 'ప్రాజెక్టు 4జీ శాచ్యురేషన్' పేరుతో బీఎస్‌ఎన్‌ఎల్‌కు కీలక ప్రాజెక్టు అప్పగించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ కొత్తగా 620 టవర్లు ఏర్పాటుచేయాల్సి ఉంది. విశాఖ జిల్లాలో ఎనిమిది, అనకాపల్లి జిల్లాలో 41, అల్లూరి జిల్లాలో 571 టవర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటికే 416 టవర్లు ఏర్పాటు చేశారు. మిగిలిన టవర్లు ఏర్పాటుచేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. మెటీరియల్ తీసుకు వెళ్లేందుకు అనువైన మార్గాలు లేక ఏజెన్సీ ప్రాంతంలో ఈ పనులు ముందుకు సాగడం లేదంటున్నారు.

ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో బీఎస్ ఎన్‌ఎల్ వినియోగదారులు 6,18,000 మంది ఉన్నారు. ఇందులో 5.4 లక్షల మంది ప్రీ పెయిడ్, 42 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు ఉన్నారు. మరో 36 వేల మంది ల్యాండ్ లైన్ వినియోగదారులు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- పీజీఆర్‌ఎస్‌లో 213 అర్జీలు స్వీకరణ


అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న జేసీ ఎం.జాహ్నవి, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆమెతోపాటు జేసీ ఎం.జాహ్నవి, ఎస్‌డీసీ ఎస్.సుబ్బలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీనివాసులు.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలపై వెంటనే సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య గురించి అర్జీదారులతో స్వయంగా మాట్లాడాలని, ఒకే సమస్యపై పదే పదే ప్రజలు అర్జీలు ఇవ్వకుండా అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. కాగా పీజీఆర్‌ఎస్‌లో వివిధ సమస్యలపై 213 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డీపీవో ఈ.సందీప్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను ఆలకించారు. మొత్తం 35 అర్జీలు అందగా.. అనంతరం వాటిని సంబంధిత అధికారులకు బదలాయించారు.

క్రైం... crime news

రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి


పక్కుర్తి మాధవరావు (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురంలో సోమవారం రైలు ఢీకొని టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు పక్కుర్తి మాధవరావు(58) మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. సీతారాంపురం గ్రామానికి చెందిన మాధవరావు సోమవారం ఉదయం మేకలను మేతకు తోలుకెళుతున్నాడు. ఈ క్రమంలో రైలు పట్టాలపైకి వెళ్లిన మేకలను పక్కకు తోలేందుకు వెళ్లాడు. అదే సమయంలో విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న తుని రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

సముద్ర తీరంలో రాళ్లలో చిక్కుకుని ఆటో డ్రైవర్ మృతి


తాతాజీ మృతదేహం

రాంబిల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం సముద్రతీరం వద్ద రాళ్ల మధ్యలో చిక్కుకుపోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ అప్పారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. రాంబిల్లికి చెందిన పెనుకొండ తాతాజీ (55) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఆస్పత్రికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో వాడపాలెం సముద్ర తీరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి రాళ్ల మధ్యలో చిక్కుకొని మృతిచెందిపడి వుండడాన్ని కొంతమంది మత్స్యకారులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ అప్పారావు, సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. రాళ్ల మధ్య చిక్కుకుని చనిపోయిన వ్యక్తిని బయటకు తీయించేందుకు చర్యలు చేపట్టారు. అయితే అలల తాకిడి తీవ్రంగా వుండడంతో మత్స్యకారుల సాయంతో సాయంత్రం ఐదు గంటలకు మృతదేహాన్ని బయటకు తీశారు. ఇతను రాంబిల్లికి చెందిన ఆటో డ్రైవర్ పెనుకొండ తాతాజీగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య, పిల్లలు వచ్చి భోరున విలపించారు. పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆస్పత్రికి వెళుతున్నట్టు కుటుంబ సభ్యులకు చెప్పిన తాతాజీ.. సముద్రం వద్దకు ఎందుకు వెళ్లాడు? మరణానికి కారణం ఏమిటో దర్యాప్తులో తేలుతుందని కేసు నమోదు చేసిన ఏఎస్‌ఐ అప్పారావు చెప్పారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి

నర్సీపట్నం, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శివపురానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడని పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునిసిపాలిటీలోని శివపురానికి చెందిన పులమారిశెట్టి సతీశ్ ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. 17వ తేదీ రాత్రి భార్య మహాలక్ష్మితో గొడవ పడి ఇంట్లోంచి బయటకు వచ్చేశాడు. సోమవారం ఉదయం శివపురంలోని కృష్ణమూర్తి ఇంటి ఆవరణలోని బావిలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్టు గుర్తించి ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న సూర్య ప్రకాశ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మృతదేహం సతీశ్‌గా పోలీసులు గుర్తించి అతని కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసుల్లో నిందితుడి అరెస్టు

నర్సీపట్నం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌లో మూడు కొట్లాట కేసులు నమోదై తొమ్మిదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేశామని సీఐ గోవిందరావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నర్సీపట్నానికి చెందిన కచ్చళ్లపాటి శివకుమార్‌పై 2016, 2017, 2019లో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మూడు కొట్లాట కేసులు నమోదయ్యాయి. అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉంది. అతనిని సోమవారం పాడేరులో అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

నాలుగు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

దేవరాపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని వాలాబు రోడ్డులో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తుండగా అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వి.సత్యనారాయణ సోమవారం రాత్రి తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తమిళనాడుకు చెందిన అలెక్షస్ పాండియన్, మహాకుమార్‌లకు గంజాయి తాగడం అలవాటు ఉండడంతో ఒడిశాలో దొరుకుతుందని తెలుసుకొని చెన్నై నుంచి పాడేరు ఏజెన్సీ మీదుగా ఒడిశా చేరుకున్నారు. నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి రెండు సంచుల్లో పట్టుకుని బైక్‌పై అల్లూరి జిల్లా పినకోట, దేవరాపల్లి మీదుగా విశాఖపట్నం వస్తున్నారు. కాగా వాలాబు రోడ్డులో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కిరండూల్ మార్గంలో రైళ్ల గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్‌లో ఈ నెల 26 వరకు కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతోపాటు గమ్యాలను కుదించి కోరాపుట్ వరకే నడపనున్నట్టు విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 23 నుంచి 25 వరకూ విశాఖలో బయలుదేరి కోరాపుట్ వెళుతుంది. ఇదే ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 24 నుంచి 26 వరకు కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈ నెల 23 నుంచి 26 వరకు విశాఖలో బయలుదేరి కోరాపుట్ వెళుతుంది. ఇదే పాసింజర్ (58502) 23 నుంచి 26 వరకూ కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది.

దైన్య స్థితిలో చిప్పాడ

... 5వ పేజీ తరువాయి

స్థలాలు కేటాయించిన ప్రదేశం ఊబి నేల కావడంతో ఇళ్లు నిర్మించుకోవడానికి వీలు కాలేదు. ప్రత్యామ్నాయంగా వెదురువాడ వద్ద పునరావాసం కల్పించాలని కోరారు. ఇది సాధ్యం కాదని, దిబ్బపాలెం వద్ద కేటాయించిన స్థలంలోనే ఇళ్లు నిర్మించుకోవాలని అప్పటి స్థానిక ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దీంతో చిప్పాడ నిర్వాసితులు ప్యాకేజీతోపాటు పునరావాసం కూడా పొందలేదు. మరోవైపు వీరి నుంచి ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో కర్మాగారాలు ఏర్పాటయ్యాయి. వ్యవసాయం లేకపోవడంతో కర్మాగారాల్లో కూలిపనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 2014లో టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు.. చిప్పాడ నిర్వాసితుల సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపి, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెదురువాడ వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేశారు. ఇంటి పెద్దతోపాటు మేజర్లకు కూడా ప్యాకేజీతో పాటు పునరావాసానికి ఐదు సెంట్ల భూమి కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. వెదురువాడ వద్ద సుమారు 30 ఎకరాలు కేటాయించారు. తొలుత పరిహారం పంపిణీ ప్రారంభించారు. చిప్పాడలో 81 మందికి, ఉద్దపాలెంలో ఎనిమిది మంది పరిహారం అందింది. మిగిలిన వారికి నిధులు మంజూరు అయ్యే సమయానికి (2019) సాధారణ ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో పునరావాసానికి స్థలాలు కేటాయించలేదు. అంతేకాక 30 ఎకరాల్లో సుమారు పది ఎకరాలను వేరే గ్రామాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేశారు.

దైన్య స్థితిలో జీవనం..

చిప్పాడ నిర్వాసితులు అత్యంత దైన్య స్థితిలో జీవనం సాగిస్తున్నారు. గ్రామాన్ని తరలించే ఉద్దేశం ఉండడంతో అధికారులు అభివృద్ధి పనులు నిలిపివేశారు. గ్రామంలోకి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైపోయింది. వర్షం కురిస్తే బురదమయం అవుతున్నది. ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. మట్టి గోడలు కూలిపోయాయి. పై కప్పులు పాడైపోవడంతో టార్పాలిన్‌లు కప్పుకొని కాలం వెళ్లదీస్తున్నారు.

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సు

... 5వ పేజీ తరువాయి

ఎంటెక్ ఓషియానిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పునఃప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

మరిన్ని నిర్ణయాలు

సెనేట్ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏయూ దూర విద్యా కేంద్రం నుంచి నిర్వహిస్తున్న పీజీ కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. సైన్స్ కళాశాల పరిధిలో పలు విభాగాల్లో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా మెరైన్ లివింగ్ రీసోర్స్ విభాగం పరిధిలో ఏడాది కాల వ్యవధితో ఆక్వా కల్చర్‌లో పీజీ డిప్లమో కోర్సును నిర్వహించడానికి ఆమోదముద్ర వేశారు. ఏయూ చిత్రకళా విభాగం, థియేటర్ ఆర్ట్స్ విభాగాలను సమన్వయం చేస్తూ స్కూల్ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ ఏర్పాటుచేయాలని మాజీ ఉప కులపతులు కొందరు సూచించారు. ఏయూ శతాబ్ది వేడుకలను జరుపుకుంటున్న తరుణంలో ప్రత్యేక గ్రాంటును అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలని పాలక మండలి సభ్యులు, పూర్వ ఉపకులపతులు సూచించారు.

దీనిపై ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేశామని, త్వరలో సమగ్ర ప్రతిపాదనలతో లేఖలు రాయనున్నట్టు వెల్లడించారు. ఏయూ సాధించిన ప్రగతిని, విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను, పూర్వ విద్యార్థులతో అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, మాజీ వీసీలు ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, బీలా సత్యనారాయణ; జీఎస్ఎన్ రాజు, జి.నాగేశ్వరరావు, వీవీజీడీ ప్రసాదరెడ్డి, పాలక మండలి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ చైర్మన్లు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

వణికిస్తున్న మలేరియా

... 5వ పేజీ తరువాయి

కేసులు తగ్గుముఖం పడతాయని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

దోమల నివారణకు పలు చర్యలు

- వరహాలు దొర, జిల్లా మలేరియా అధికారి

జిల్లాలో కొద్ది రోజులుగా మలేరియా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్న మాట వాస్తమే. గ్రామాల్లో మలేరియా కారక దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. అన్ని గ్రామాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ కొనసాగుతున్నది. రెండు మూడు రోజులకు మించి జ్వరం, తలనొప్పి వుంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలి. పాజిటివ్ రిపోర్ట్ వస్తే ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు ఇస్తారు. అదృష్టవశాత్తూ జిల్లాలో ఈ ఏడాది ఇంతవరకు ఒక్క మలేరియా మరణం కూడా సంభవించలేదు.

తాండవ ఆయకట్టుకు రెండో వారంలో నీరు విడుదల

... 5వ పేజీ తరువాయి

నిమ్మకట్టు ఛానెల్ గట్లపై కొందరు జీడిమామిడి తోటలు వేశారని, ప్రాజక్టు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. కోటవురట్ల వీపీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వేచలపు జనార్దన్ మాట్లాడుతూ, కాలువ చివరి భూములకు నీరు సరిగా అందడం లేదని, ఈ ఏడాది సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ జోగిబాబు, మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, తుని ఏఎంసీ చైర్మన్ అంకంరెడ్డి రమేశ్, ప్రాజెక్టు డీఈఈ అనురాధ, ఏఈ శ్యామ్, తెలుగుదేశం పార్టీ నాయకులు నందిపల్లి వెంకటరమణ, ఎన్.విజయ్‌కుమార్, పారుపల్లి దాసు, అపిరెడ్డి మాణిక్యం ఇటంశెట్టి సీతారామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రెండు నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

జీవీఎంసీ జడ్సీకి నోటీసు ఇచ్చిన యూనియన్ నాయకులు



జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తికి సమ్మె నోటీసు ఇస్తున్న కోన లక్ష్మణ

అనకాపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు రెండో తేదీ నుంచి మునిసిపల్ కార్మికులు సమ్మె చేపట్టనున్నట్టు ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోన లక్ష్మణ చెప్పారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తికి సమ్మె నోటీసు అందజేశారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు, ఆఫీస్ సిబ్బందికి, పార్కు కూలీలకు వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, డీఏలు, సరెండర్ లీవ్‌లు విడుదల చేయాలని, రిటైర్డు కార్మికులకు గ్రాట్యూటీ చెల్లించాలని కోరారు. కార్మికులపై పనిభారం పెరిగినప్పటికీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మొగ్గు చూపకపోవడం విచారకరమన్నారు. ఇందుకు నిరసనగా రెండో తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సతీశ్‌కుమార్, సింగంపల్లి అజయ్‌కుమార్, యర్రంశెట్టి అప్పారాజు, బంగారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544